E-KABURU E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

(తేదీ) 14-08-2025 (వారం) గురువారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



లాభాల్లో ముగిసిన మార్కెట్లు » 4లో

బాబర్ ఆజం వరల్డ్ రికార్డు బద్దలు కొట్టిన గిల్.. ఆ ఘనత సాధించిన ఏకైక ప్లేయర్‌గా.. » 4లో



జియో హాట్‌స్టార్ ఆ ఒక్క రోజు అందరికీ ఫ్రీ.. » 4లో

JioHotstar

మునిగిన మంచు లక్ష్మి ఈడీ విచారణ... మూడున్నర గంటల పాటు.. » 5లో



# వారి సభ్యత్వాలు రద్దు!








- ఎమ్మెల్సీలుగా కోదండరాం, అమేర్ అలీఖాన్‌ల నియామకంపై సుప్రీం సంచలనాత్మక తీర్పు
- గవర్నర్ కోటా నామినేషన్లపై మధ్యంతర ఉత్తర్వు సవరణ
- మధ్యంతర ఉత్తర్వు మేరకు తీసుకున్న చర్యలన్నీ రద్దయినట్టేనన్న ధర్మాసనం
- భవిష్యత్ నామినేషన్లు తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టీకరణ
- తదుపరి విచారణ సెప్టెంబర్ 17కు వాయిదా

ఈ కబురు, న్యూఢిల్లీ: గవర్నర్ కోటాలో తెలంగాణ శాసనమండలికి ఎన్నికైన ప్రొఫెసర్ కోదండరాం, అమేర్ అలీఖాన్‌ల సభ్యత్వాలను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు సంచలనాత్మక తీర్పు వెలువరించింది. గతేడాది ఆగస్టు 14న సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వును ధర్మాసనం తాజాగా సవరించింది. మధ్యంతర ఉత్తర్వు మేరకు తీసుకున్న చర్యలు ఏవైనా రద్దయినట్టేనని పేర్కొంది. మధ్యంతర ఉత్తర్వులోని.. 'తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే విధిస్తున్నాం..' అనే వాక్యాన్ని తొలగిస్తున్నట్లు తెలిపింది. దీంతో 2024 ఆగస్టు 16న ప్రొఫెసర్ కోదండరాం, అమేర్ అలీఖాన్‌లు ఎమ్మెల్సీలుగా చేసిన ప్రమాణ స్వీకారాలు రద్దయినట్టయ్యింది.

తరువాయి 2లో

## 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు జ్ఞానపథ్ సిద్ధం.. 5 వేల మంది గెస్టులు, మోదీ స్పీచ్



» మన భారతదేశ స్వాతంత్ర సంగ్రామ విజయం, సాహస గాథకు 79 ఏళ్లు. ఆగస్టు 15న ఎర్రకోట నుంచి నుంచి ప్రధాని మోదీ స్పీచ్ సహా పండుగ వెలుగులు విరజిమ్మబోతున్నాయి. అయితే ఈసారి జరగనున్న ప్రత్యేక కార్యక్రమాల గురించి ఇక్కడ తెలుసుకుందాం.

తరువాయి 2లో

## మరోసారి అమెరికాకు మోదీ!



26న ఐరాస సమావేశాల్లో ప్రసంగించనున్న ప్రధాని ట్రంప్‌తో భేటీ ఖరారుకు విదేశీ వ్యవహారాలశాఖ కసరత్తు

తరువాయి 2లో

## నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం

- ఏర్పాటుచేయాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- సౌకర్యవంతంగా ఇంటిగ్రేటెడ్‌సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- భూధార్ నంబర్ల కేటాయింపునకు ప్రణాళికలు రూపొందించాలి
- రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై సమీక్షలో సీఎం వెల్లడి





ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా భూములకు భూధార్ నంబర్ల కేటాయింపునకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై సీఎం బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు జిల్లాల్లో పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయిందని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లగా.. ఈ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

తరువాయి 2లో

## ఓటు'పోటు మాటలు

» బిహార్ జాబితాపై అధికార,విపక్షాల వాగ్బాణాలు
» ఓటుచోరీతోనే రాహుల్, ప్రియాంక, అఖిలేశ్ గెలిచారు
» వారంతా రాజీనామా చేయాల్సిందే
» పౌరసత్వానికి ముందే సోనియాకు ఓటుహక్కు: భాజపా
» సీబీఐ, ఈడీల తర్వాత ఈసీని వాడుతున్నారన్న తేజస్వి




ఈ కబురు,దిల్లీ: ఓటర్ల జాబితా రూపకల్పన, ఎన్నికల సంఘం (ఈసీ) పనితీరుపై అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం ముదురుతోంది. స్వతంత్ర వ్యవస్థల్ని కేంద్ర సర్కారు గుప్పిట్లోకి తీసుకుంటోందని విపక్షం ఆరోపిస్తోంది. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ తదితరులు ఓటుచోరీతోనే గెలిచారని భాజపా కొత్త ఆరోపణలు చేసింది. ఇటలీకి చెందిన సోనియాగాంధీ భారతదేశ పౌరసత్వం తీసుకోకముందే ఓటర్ల జాబితాలో ఆమె పేరు నమోదైందని గుర్తుచేసింది. బిహార్ శాసనసభ ఎన్నికల దృష్ట్యా ఈసీతో భాజపా కుమ్మక్కయి ఒక్కొక్కరికి రెండేసి ఓట్లు ఉండేలా చూసుకుంటోందని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ చెబుతున్నారు. ఓటుచోరీపై ఇక ప్రజల్లోకి వెళ్లి పోరాడతామని, దీనిని ప్రజా ఉద్యమంగా మార్చబోతున్నామని..

తరువాయి 3లో

## యుద్ధం ఆపకుంటే..

### తీవ్ర పరిణామాలు తప్పవు



ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ఆపకపోతే రష్యా తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు.

3లో

## సుప్రీంకోర్టు సంచలన తీర్పు..

### కేటీఆర్ రియాక్షన్



ఈ కబురు, హైదరాబాద్: గవర్నర్ కోటా కింద కాంగ్రెస్ నియమించిన ఇద్దరు ఎమ్మెల్సీల ఎన్నిక చెల్లదంటూ సుప్రీంకోర్టు సంచలన తీర్పు..

3లో



## జోరువాన.. యమ యాతన

- హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో భారీ వర్షాలు
- ఉమ్మడి ఆదిలాబాద్‌లో కుండపోత
- పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు
- రాష్ట్రంలో మరో నాలుగు రోజులు భారీ వర్షాలే
- నేడు మూడు జిల్లాల్లో పాఠశాలలకు సెలవు

తరువాయి 2లో

## వారి నుంచి నాకు ముప్పు ఉండొచ్చు: రాహుల్ గాంధీ



తరువాయి 3లో

## రష్యా అమ్మేసిన భూభాగం లోనే.. ట్రంప్‌పుతిన్ భేటీ




తరువాయి 3లో

మొదటి పేజి తరువాయి

# వారి సభ్యత్వాలు రద్దు!



గవర్నర్ కోటాకు సంబంధించి భవిష్యత్తులో జరిగే నామినేషన్లు సుప్రీంకోర్టు తుది తీర్పునకు లోబడి ఉంటాయని స్పష్టం చేసింది. కోదండరాం, అమేర్ అలీఖాన్‌ల నామినేషన్‌ను సవాల్ చేస్తూ దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్రా సత్యనారాయణ దాఖలు చేసిన పిటిషన్‌పై తాజాగా విచారణ చేపట్టిన జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం మధ్యంతర తీర్పు ఇచ్చింది.

వారు ఎమ్మెల్సీలుగా మండలిలో తిరిగి ప్రవేశించాలంటే మళ్లీ సిఫారసు చేయబడాలని జస్టిస్ విక్రమ్‌నాథ్ స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీగా ఉండకూడదనే వాదనను తిరస్కరిస్తూ, 'అప్పట్లో పిటిషనర్ల పేర్లు తిరస్కరించినప్పుడు కూడా ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీగానే ఉన్నాయి..' అని ఆయన వ్యాఖ్యానించారు. అనంతరం ధర్మాసనం తదుపరి విచారణను సెప్టెంబర్ 17వ తేదీకి వాయిదా వేసింది.

సిఫారసులు.. తిరస్కరణ.. సిఫారసులు

2023 జూలైలో అప్పటి సీఎం కె.చంద్రశేఖర్‌రావు నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం, దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్ర సత్యనారాయణల పేర్లను గవర్నర్ కోటా ఎమ్మెల్సీ స్థానాలకు సిఫారసు చేసింది. అయితే సెప్టెంబర్‌లో అప్పటి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్.. వారికి రాజకీయ నేపథ్యం ఉండటాన్ని ప్రస్తావించడంతో పాటు, రాజ్యాంగంలోని ఆర్టికల్ 171(5)కు అనుగుణంగా వారి నియామకాలు లేవని పేర్కొంటూ వారి నామినేషన్లను తిరస్కరించారు. కాగా 2023 చివర్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జనవరిలో ప్రొఫెసర్ కోదండరాం, జర్నలిస్టు అమేర్ అలీ ఖాన్‌లను గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసింది. ఈ నామినేషన్లతో పాటు, గవర్నర్ తమ నామినేషన్లను తిరస్కరించడాన్ని దాసోజు, కుర్ర హైకోర్టులో సవాలు చేశారు. ఈ నేపథ్యంలో 2024 మార్చిలో హైకోర్టు.. గవర్నర్ తిరస్కరణను రద్దు చేయడంతో పాటు కొత్త నామినేషన్లను కూడా కొట్టివేసింది. గవర్నర్ మంత్రివర్గ సలహా మేరకే వ్యవహరించాలని, సవరణలు కోరే హక్కు మాత్రమే ఉందని కోర్టు స్పష్టం చేసింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్లగా, 2024 ఆగస్టు 14న ధర్మాసనం హైకోర్టు ఉత్తర్వుపై స్టే ఇచ్చింది. కోదండరాం, అమేర్ అలీ ఖాన్‌లు ఎమ్మెల్సీలుగా ప్రమాణం చేసుకోవడానికి అనుమతించింది. అయితే వారి నామినేషన్లు తుది తీర్పుకు లోబడి ఉంటాయని తెలిపింది. తాజాగా బుధవారం జరిగిన వాదనల అనంతరం మధ్యంతర ఉత్తర్వును సవరించింది. మధ్యంతర ఉత్తర్వు ఆధారంగా తీసుకున్న అన్ని చర్యలు, అందులో ప్రమాణ స్వీకారాలు కూడా రద్దు అవుతాయని స్పష్టం చేసింది. ఇకపై ఆ రెండు ఎమ్మెల్సీ స్థానాల కోసం జరిగే ఏ కొత్త నామినేషన్లు అయినా, సెప్టెంబర్ 17న జరిగే విచారణ తర్వాత వచ్చే తుది తీర్పుపైనే ఆధారపడి ఉంటాయని తెలిపింది. కాగా గవర్నర్ తరపున వాదించిన అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన సిఫారసు మేరకే గవర్నర్ ఆమోదం తెలిపారని వాదించారు. పిటిషనర్లు తమ నామినేషన్ల అమలును కాదు, గవర్నర్ తిరస్కరణను సవాలు చేస్తున్నారని పేర్కొన్నారు. గవర్నర్ పూర్తిగా రాజ్యాంగపరమైన విధానాన్నే అనుసరించారని చెప్పారు. పిటిషనర్ల తరపున న్యాయవాది రంజిత్‌కుమార్ వాదించారు. గవర్నర్.. 'హైకోర్టుకు నేనుజవాబు చెప్పాల్సిన అవసరం లేదు..' అని చెప్పారని తెలియజేయగా, 'చాలా దురదృష్టకరం' అని జస్టిస్ విక్రమ్‌నాథ్ వ్యాఖ్యానించారు.






మొదటి పేజి తరువాయి

# నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం




ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా భూములకు భూధార్ నంబర్ల కేటాయింపునకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై సీఎం బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు జిల్లాల్లో పెద్ద సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయిందని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లగా.. ఈ నెలాఖరులోగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంబోత్సవానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో వారసత్వ, మ్యుటేషన్‌కు సంబంధించి స్వీకరించిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని చెప్పారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లు సర్వే చేసిన అనంతరం రెగ్యులర్ సర్వేయర్లు వాటిని స్రూకిటినీ చేసేలా చూడాలని ఆదేశించారు. కోర్ అర్బన్ ఏరియాలో నూతనంగా నిర్మించనున్న 10 ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నమూనాలను సీఎం పరిశీలించారు. ప్రతి కార్యాలయంలో పార్కింగ్, క్యాంటీన్, ఇతర మౌలిక వసతులు ఉండాలని, కార్యాలయాలు ప్రజలకు స్నేహపూర్వక వాతావరణంలో సౌకర్యవంతంగా ఉండేలా చూడాలని సూచించారు. హైదరాబాద్‌లో హౌసింగ్ బోర్డుతో జాయింట్ వెంచర్‌గా ఉన్న ప్రాజెక్టుల్లోని సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. సమీక్షలో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం ముఖ్య కార్యదర్శులు వి.శేషాద్రి, కేఎస్ శ్రీనివాసరాజు, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, సీసీఎల్ఏ, రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్ కుమార్, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వీపీ గౌతమ్ పాల్గొన్నారు.

# జోరువాన.. యమ యాతన



ఈ కబురు హైదరాబాద్, ఈటీవీ ఆదిలాబాద్, న్యూస్‌టుడే ఉమ్మడి వరంగల్: రాష్ట్రవ్యాప్తంగా బుధవారం ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షం కురిసింది. రాజధాని హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదైంది. చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. పల్లె, పట్టణం తేడా లేకుండా చాలాచోట్ల రోడ్లు, కాలనీలపైకి వరదనీరు చేరడంతో జనజీవనం అతలాకుతలమైంది. ప్రధానంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు జోరువాన కురిసింది. కన్నెపల్లి (మంచిర్యాల జిల్లా)లో అత్యధికంగా 23.3 సెం.మీ. వర్షపాతం నమోదైంది. భీమిని (మంచిర్యాల)లో 22.6, రెబ్బెన (కుమురం భీం)లో 22 సెం.మీ. వర్షం పడింది. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వచ్చే నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని.. ఉరుములు మెరుపులు, గంటకు 40 నుంచి 50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం 7 నుంచి 12 సెం.మీ. వర్షం కురిసే అవకాశం ఉందని ప్రకటించారు. ఉత్తర తెలంగాణలో 17వ తేదీన వర్షపాతం అధికంగా ఉండే అవకాశం ఉందని వెల్లడించారు. మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించడంతో ఆ జిల్లాల్లో గురువారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నిటికీ సెలవు ప్రకటిస్తూ పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు డాక్టర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు.

**ఉదయం నుంచే ధాటిగా...**

బుధవారం ఉదయం నుంచే వర్షాలు ధాటిగా ప్రారంభమయ్యాయి. తాండూరు (మంచిర్యాల) 18.2, చిట్యాల (భూపాలపల్లి)లో 18 సెం.మీ., మంగపేట (ములుగు) 16.4, నెన్నెల (మంచిర్యాల) 14.6, గిన్నెదరి (కుమురంభీం) 14.3, జంబుగ 13.8, జంకాపూర్ (మంచిర్యాల)లో 13.7, రేగొండ (భూపాలపల్లి)లో 13.3, కుంచవల్లి (కుమురంభీం)లో 12.7 సెం.మీ వర్షపాతం నమోదైంది.

సిద్దిపేట జిల్లా పెద్దాపూర్, కరీంనగర్ జిల్లా పోచంపల్లి, ములుగు జిల్లా వెంకటాపురం, చెల్పూరు, మంగపేట, సూర్యాపేట జిల్లా అలంగపురం, పెద్దపల్లి జిల్లా శ్రీరాంపూర్, కరీంనగర్ జిల్లా చిగురుమామిడిలలో భారీ వర్షపాతం నమోదైంది.

**రాజధానిలోనూ..**

రాజధాని హైదరాబాద్‌లో బుధవారం భారీ వర్షం కురిసింది. దక్షిణ నగరంలోని మామిడిపల్లి, శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్ ప్రాంతాల్లో వరుణుడు బీభత్సం సృష్టించాడు. బాలాపూర్ మండలంలోని మామిడిపల్లిలో రాత్రి 9 గంటల వరకు 9.35 సెం.మీ. గరిష్ఠ వర్షపాతం నమోదవగా, శంషాబాద్‌లో 8.7 సెం.మీ. వర్షం కురిసింది. హైటెక్‌సిటీ నుంచి ఖైరతాబాద్ వరకు ఓ మోస్తరు వాన కురవగా, ఉత్తర భాగంలోని శామీర్‌పేట, అల్వాల్, కొంపల్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. గగన్‌పహాడ్‌లో విమానాశ్రయం వైపు వెళ్లే బెంగళూరు హైవేపై మోకాల్లోతు నీరు ప్రవహించింది. నాలుగేళ్ల కిందట జల్‌పల్లిలో ఎదురైన తీవ్రమైన ముంపు సమస్య పునరావృతమైంది. పదుల కొద్దీ కాలనీలు నీట మునిగాయి. పాతబస్తీలోని యాకుత్‌పురలో మహ్మద్ గౌస్ అనే యువకుడు ప్రమాదవశాత్తు జారి నాలాలో పడగా.. హైడ్రా సిబ్బంది నిచ్చెన సాయంతో రక్షించారు. వర్ష హెచ్చరికలు, ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోం ప్రకటనలతో రహదారులపై వాహనాల రాకపోకలు ఓ మోస్తరుగానే కనిపించాయి.

**ఆదిలాబాద్ అతలాకుతలం**

ఆదిలాబాద్ జిల్లా తాండూరులోని రైల్వే అండర్ బ్రిడ్జి నీట మునిగింది. ముందుజాగ్రత్తగా రైల్వే గేటును అధికారులు మూసివేశారు. భీమిని మండలం పెద్దపేట, రాజారం మధ్య వాగు ఉప్పొంగడంతో రాకపోకలు నిలిచాయి. చిన్నతిమ్మాపూర్ వద్ద ఎర్రవాగు ఉప్పొంగింది. నల్లవాగు ఉప్పొంగడంతో పంట పొలాలు నీట మునిగాయి. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో వర్షం దంచికొడుతుండడంతో వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. తిర్యాని మండలం మాణిక్యపూర్‌వాగు ప్రవాహ తీవ్రత కారణంగా రాకపోకలు నిలిచిపోయాయి. ఆసిఫాబాద్‌లోని సందీప్‌నగర్‌లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంచిర్యాల జిల్లా తాండూరు మండలం దొడ్డిగూడెంలో పురిటినొప్పులతో బాధపడుతున్న కొడప యమునను ఆసుపత్రికి తరలిస్తుండగా.. దారిలో నస్పూర్ వాగు పొంగిపొర్లటంతో చాలాసేపు అక్కడే వేచిచూడాల్సి వచ్చింది. తాండూరు ఎస్సై కిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు వచ్చి యమునను స్ట్రెచర్‌పై ఉంచి తాళ్లసాయంతో వాగు దాటించి బెల్లంపల్లి ఆసుపత్రికి తరలించగా ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. నిర్మల్ జిల్లాలోని కడెం జలాశయం రెండు గేట్లు, స్వర్ణ, గడ్డెన్న జలాశయాల నుంచి ఒక్కో గేటు ఎత్తి.. నీటిని దిగువకు వదిలేశారు.

**నేడు జిల్లాలకు వర్ష హెచ్చరికలు ఇలా..**

రెడ్ ఎలర్ట్: సంగారెడ్డి, మెదక్, మేడ్చల్, వికారాబాద్, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి, భూపాలపల్లి, ములుగు



మొదటి పేజి తరువాయి

# మరోసారి అమెరికాకు మోదీ!



**ఈ కబురు,ఐరాస: అమెరికాతో వాణిజ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో మరోసారి ఆ దేశంలో ప్రధాని మోదీ పర్యటించనున్నట్లు తెలుస్తోంది. న్యూయార్క్ వేదికగా సెప్టెంబరులో జరగనున్న ఐక్యరాజ్య సమితి 80వ సమావేశాలకు మోదీ హాజరు కానున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ సమావేశాలు సెప్టెంబరు 9న ప్రారంభం కానుండగా...23-29 మధ్య ఉన్నతస్థాయి చర్చలు జరగనున్నాయి. 26న భారత 'ప్రభుత్వ అధిపతి' సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారని ఐరాస తాత్కాలిక వక్తల జాబితా పేర్కొంది. కాగా అదే రోజు ఇజ్రాయెల్, చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల ప్రభుత్వాధినేతలు సైతం ప్రసంగాలు చేయనున్నారు. అయితే ఈ విషయమై ప్రభుత్వం నుంచి ఎటువంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఐరాసకు చెందిన ఈ ప్రతిష్ఠాత్మక సమావేశాల సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సహా పలు దేశాల ప్రభుత్వాధినేతలతో భారత ప్రధాని భేటీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రత్యేకించి ట్రంప్, మోదీ భేటీకి అధికారికంగా షెడ్యూల్‌ను ఖరారు చేయించేందుకు భారత విదేశీ వ్యవహారాల శాఖ కసరత్తు మొదలుపెట్టిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.**

మొదటి పేజి తరువాయి

# 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు జ్ఞానపథ్ సిద్ధం.. 5 వేల మంది గెస్టులు, మోదీ స్పీచ్



ఈ కబురు:మన భారతదేశ 79వ స్వాతంత్ర దినోత్సవం రేపు (ఆగస్టు 15) ఘనంగా జరగనుంది. ఈ ఏడాది, ఈ పండుగను మరింత ఘనంగా జరుపుకోవడానికి దేశం సిద్ధమైంది. ఈసారి న్యూ ఇండియా థీమ్‌తో, దేశవ్యాప్తంగా 140కి పైగా ప్రదేశాల్లో సైనిక, పారామిలిటరీ దళాలు ఆపరేషన్ సిందూర్ విజయం పేరుతో అద్భుతమైన ప్రదర్శనలు ఇవ్వబోతున్నాయి. ఈ వేడుకలు మన దేశ ఐక్యత, అభివృద్ధి, స్వావలంబన స్ఫూర్తిని ప్రతిబింబిస్తాయి. ఇంకా స్పెషల్ విషయం ఏంటంటే, ఈ గ్రాండ్ ఈవెంట్ కోసం 5000 మంది ప్రత్యేక అతిథులను ఆహ్వానించారు.

దేశవ్యాప్తంగా ఉత్సవం

ఈ ఏడాది స్వాతంత్ర దినోత్సవం ఎందుకంత స్పెషల్ అంటే, మొదటి సారిగా భారత సైన్యం, నేవీ, వైమానిక దళం, కోస్ట్ గార్డ్, NCC, CRPF, BSF, ITBP, CISF, SSB, RPF, అస్సాం రైఫిల్స్ వంటి దళాల బ్యాండ్‌లు దేశవ్యాప్తంగా 96 నగరాల్లో సంగీత ప్రదర్శనలు ఇవ్వబోతున్నాయి. ఈ బ్యాండ్‌ల సంగీతం దేశ బలం, ఐక్యతను చాటి చెబుతుంది. ఈ క్రమంలో ఢిల్లీలోని ఇండియా గేట్, కర్తవ్య పథ్, విజయ్ చౌక్, పురానా ఖిలా, నిజాముద్దీన్, న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ల వంటి ఐకానిక్ ప్రదేశాలు ఈ వేడుకలతో కళకళలాడనున్నాయి.

దేశం దిశగా ఒక అడుగు

ఈసారి స్వాతంత్ర దినోత్సవ థీమ్ న్యూ ఇండియా. ఈ థీమ్ మన దేశం ప్రతి రంగంలోనూ వేగంగా అభివృద్ధి చెందుతోందని, 2047 నాటికి పూర్తిగా బలమైన, స్వావలంబన దేశంగా మారాలనే లక్ష్యాన్ని సూచిస్తోంది. ఈ వేడుకల నేపథ్యంలో ప్రజలు దేశభక్తి స్ఫూర్తితో నృత్యాలు చేస్తూ, మన దేశ ఉజ్వల భవిష్యత్తును జరుపుకోనున్నారు.

సన్నాహాలు పక్కాగా పూర్తి

స్వాతంత్ర దినోత్సవ సన్నాహాల గురించి చెప్పాలంటే, అన్నీ ఇప్పటికే సిద్ధమయ్యాయి. బుధవారం గ్రాండ్ రిహార్సల్ కూడా జరిగాయి. ఈ కార్యక్రమంలో సుమారు 2,500 మంది మహిళా, పురుష క్యాడెట్లు, మై భారత్ వాలంటీర్లు న్యూ ఇండియా లోగోను తయారు చేస్తూ అద్భుతమైన దృశ్యాన్ని సృష్టిస్తారు.

5000 మందికి ఆహ్వానం

ఈసారి వేడుకలను మరింత గొప్పగా చేసేందుకు 5000 మంది ప్రత్యేక అతిథులను ఆహ్వానించారు. వీరిలో స్పెషల్ ఒలింపిక్స్ 2025లో పాల్గొన్న క్రీడాకారులు, అంతర్జాతీయ స్థాయిలో విజయం సాధించిన అథ్లెట్లు, ఖేలో ఇండియా పారాగేమ్స్ బంగారు పతక విజేతలు, జాతీయ తేనెటీగల పెంపకం మిషన్‌లో ఉత్తమ రైతులు, పోటీల్లో గెలిచిన విద్యార్థులు ఉన్నారు. అంతేకాదు పారిశుధ్య కార్మికులు, అంగన్‌వాడీ కార్మికులు, లఖ్‌పతి దీదీ పథకం లబ్ధిదారులు కూడా ఈ వేడుకల్లో భాగమవుతారు. ఆహ్వాన కార్డులపై ఆపరేషన్ సింధూర్ లోగోతో పాటు, న్యూ ఇండియా పురోగతికి చిహ్నంగా ఉన్న చీనాబ్ వంతెన చిత్రం కూడా ఉంది.

ప్రధాని మోదీ సందేశం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎర్రకోట నుంచి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి, దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఆయన సందేశం న్యూ ఇండియా బలం, స్వావలంబన గురించి ఉంటుంది.

# రూటు మార్చిన గంజాయి స్మగ్లర్లు



**రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి నియంత్రణకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక విభాగం ఈగల్ ఏర్పాటు చేయడంతో స్మగ్లర్లు..**

**రూటు మార్చిన గంజాయి స్మగ్లర్లు**

**రైళ్లలో తనిఖీలు చేసి చెక్ పెడుతున్న పోలీసులు**

**'ఆపరేషన్ ఈగల్' కొనసాగిస్తాం: డీజీపీ**

అమరావతి, ఈ కబురు: రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి నియంత్రణకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక విభాగం(ఈగల్) ఏర్పాటు చేయడంతో స్మగ్లర్లు రూటు మార్చారు. విశాఖ జిల్లా మన్యంలో గంజాయి సాగు పది వేల ఎకరాల నుంచి 100 ఎకరాలకు తగ్గించేసిన పోలీసుల చర్యలు స్మగ్లర్లను ఆర్థికంగా దెబ్బతీశాయి. దేశంలో ఎక్కడా లేని శీలావతి రకం గంజాయి మన రాష్ట్రంలో లభిస్తుండంతో దేశ వ్యాప్తంగా డిమాండ్ ఉంది. దీంతో గత వైసీపీ ప్రభుత్వంలో దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా ఆంధ్రప్రదేశ్ పేరు వినిపించేంది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మంత్రుల కమిటీ ఏర్పాటు చేసి అధ్యయనం చేసి 459 మందితో ఈగల్ విభాగాన్ని ఏర్పాటు చేసి ఐజీ ఆకే రవికృష్ణ నేతృత్వంలో గంజాయి కట్టడికి చర్యలు చేపడుతోంది. ఓ వైపు విద్యార్థుల్లో, వినియోగదారుల్లో అవగాహన తీసుకొస్తూ.. మరో వైపు సరఫరాదారులపై ఆయా ప్రాంతాల పోలీసులతో కలిసి కేసులు పెడుతోన్న ఈగల్ బృందం రోడ్డు మార్గంలో మత్తు పదార్థాల సరఫరాకు అడ్డుకట్ట వేయగలిగింది. అయితే ఒడిసా నుంచి తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఇతర ఉత్తరాది రాష్ట్రాలకు మన రాష్ట్రం మీదుగా వెళ్లే రైళ్లలో గంజాయి తరలిస్తున్నారు. దీనిపై దష్టి సారించి గత నెల 3 నుంచి 11 వరకు చేపట్టిన 'ఆపరేషన్ ఈగల్' మంచి ఫలితాలు ఇచ్చిందని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు. మన రాష్ట్రం గుండా వెళ్లే పలు రైళ్లలో తనిఖీలు నిర్వహించి 43 కిలోల గంజాయి, 436 గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకుని పది మందిపై ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు చేసి జైలుకు పంపినట్టు చెప్పారు. కోరమండల్ ఎక్స్‌ప్రెస్, రాయగడ గుంటూరు ఎక్స్‌ప్రెస్, కోర్బా విశాఖపట్నం, ఎంజీఆర్ సెంట్రల్ చెన్నై ఎక్స్‌ప్రెస్, టాటానగర్ ఎర్నాకుళం, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లలో గంజాయి తరచూ పట్టుబడుతోందని వెల్లడించారు. మత్తు పదార్థాలకు ఎవరూ అలవాటు పడొద్దని, గంజాయి విక్రయాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీజీపీ కోరారు.

మొదటి పేజీ తరువాయి

# సుప్రీంకోర్టు సంచలన తీర్పు.. కేటీఆర్ రియాక్షన్



ఈ కబురు, హైదరాబాద్: గవర్నర్ కోటా కింద కాంగ్రెస్ నియమించిన ఇద్దరు ఎమ్మెల్సీల ఎన్నిక చెల్ల దంటూ సుప్రీంకోర్టు సంచలన తీర్పు.. అటు బీజేపీకి, ఇటు కాంగ్రెస్‌కు చెంపపెట్టు అంటూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు(కేటీఆర్) అన్నారు."గతంలో బీజేపీ.. గవర్నర్ వ్యవస్థను దుర్వినియోగం చేసి బీఆర్ఎస్ పంపిన ఇద్దరు ఎమ్మెల్సీ ప్రతిపాదనలకు అడ్డుపడితే, ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ప్రక్రియ పెండింగ్‌లో ఉండగానే మరో ఇద్దరి పేర్లను సిఫారసు చేసి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసింది. బీఆర్ఎస్ గతంలో నామినేట్ చేసిన బడుగు, బలహీనవర్గాలకు చెందిన దాసోజు శ్రవణ్, సత్యనారాయణల అభ్యర్థిత్వాలకు అడ్డుతగిలిన కాంగ్రెస్, బీజేపీల నిజస్వరూపం మరోసారి బట్టబయలైంది" అంటూ ఎక్స్ వేదికగా కేటీఆర్ దుయ్యబట్టారు. "రాజ్యాంగంపై ఏమాత్రం గౌరవం లేని ఈ రెండు ఢిల్లీ పార్టీల అప్రజాస్వామిక విధానాలు ఎంతమాత్రం సాగనివ్వమని చాటిచెప్పిన గౌరవ న్యాయవ్యవస్థకు బీఆర్ఎస్ పక్షాన శిరస్సు వంచి సలాం చేస్తున్నాం" అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.

# రాజకీయ అక్కసుతోనే తెలంగాణకు అన్యాయం



ఈ కబురు, హైదరాబాద్: పారిశ్రామికాభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు రోల్‌మోడల్‌గా నిలుస్తున్న తెలంగాణపై రాజకీయ అక్కసుతోనే కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శించారు. సెమీకండక్టర్ ప్రాజెక్టు కేటాయింపులో వివక్ష చూపించి, రాష్ట్రంపై సవతి తల్లి ప్రేమను చూపిస్తోందంటూ బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో మండిపడ్డారు. "ప్రపంచస్థాయి అధునాతన సిస్టమ్ అండ్ ప్యాకేజింగ్ ఫెసిలిటీ ఏర్పాటు కోసం రాష్ట్రప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. మహేశ్వరంలో 10 ఎకరాల భూమి కేటాయించాం. అన్ని రకాల సబ్సిడీలకు ఆమోదం తెలిపాం. రికార్డు సమయంలో అన్ని అనుమతులిచ్చాం. ఇండియా సెమీకండక్టర్ మిషన్‌కు తుది ఆమోదం లభిస్తే.. పనులు మొదలు పెట్టేందుకు సదరు ఇన్వెస్టర్ సిద్ధంగా ఉన్నారు. అయినా కేంద్రం పట్టించుకోలేదు. అన్నిరకాలుగా అర్హతలున్నా తెలంగాణను విస్మరించడం సరికాదు. ఇలాంటి రాజకీయ ప్రేరేపిత నిర్ణయాలు దేశ పారిశ్రామికాభివృద్ధికి మంచిది కాదు. నిర్ణయాన్ని మరోసారి పునఃపరిశీలించాల్సిన అవసరముంది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి జోక్యం చేసుకుని తెలంగాణకు న్యాయం జరిగేలా చొరవ చూపాలి" అని మంత్రి శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. 'ఇండియాస్ 100 మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్షియల్ పీపుల్ ఇన్ ఏఐ2025' జాబితాలో శ్రీధర్‌బాబుకు చోటు మంత్రి శ్రీధర్‌బాబుకు అరుదైన గౌరవం దక్కింది. 'అనలిటిక్స్ ఇండియా' మ్యాగజైన్ తాజాగా ప్రకటించిన 'ఇండియాస్ 100 మోస్ట్ ఇన్‌ఫ్లూయెన్షియల్ పీపుల్ ఇన్ ఏఐ2025' జాబితాలో ఆయనకు చోటు లభించింది. సమర్థ నాయకత్వం, నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహమిస్తూ.. భారత్‌ను ఏఐ రంగంలో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న వ్యక్తులకు ఇందులో చోటు కల్పించారు. విధాన రూపకర్తల విభాగంలో శ్రీధర్‌బాబును ఎంపిక చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ.. "ఇది నా ఒక్కడికి లభించిన గుర్తింపు కాదు. యావత్తు తెలంగాణ ప్రజలకు దక్కిన గౌరవం. సమ్మిళిత వృద్ధి, మెరుగైన జీవితాలను అందించేందుకు ఏఐని వినియోగించాలన్న మా ప్రభుత్వ సుదూర దృష్టికి ఇది నిదర్శనం. సీఎం రేవంత్‌రెడ్డి ప్రోత్సాహంతోనే ఈ జాబితాలో చోటు దక్కింది" అని పేర్కొన్నారు.

# గౌలిదొడ్డిలో రేణుక ఎల్లమ్మ అమ్మవారి ప్రతిష్ట మహోత్సవం



ఈనెల 16 నుంచి 18 వరకు మూడు రోజులపాటు కొనసాగనున్న ఉత్సవాలు
18వ తేదీన విగ్రహ ప్రతిష్ట, బోనాలు

ఈ-కబురు, శేరిలింగంపల్లి : ఐటీ కారిడార్ పరిధిలోని గౌలిదొడ్డి గ్రామంలో శ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి ప్రతిష్ట మహోత్సవాలు ఈనెల 16వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజులపాటు కొనసాగునున్న ఈ ప్రతిష్ట మహోత్సవాల కోసం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేపడుతున్నారు. 16వ తేదీన ఉదయం గణపతి పూజతో ఉత్సవాలను ప్రారంభిస్తుండగా, 18వ తేదీన అమ్మవారి ప్రతిష్టాపనను వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించనున్నారు. ఈ మేరకు మూడు రోజులపాటు నిర్వహించనున్న ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు వివరించారు. 16వ తేదీన గణపతి పూజతో ఉత్సవాలను ప్రారంభించి కంకణ పూజ, అంకురారోపణం, యాగశాల ప్రవేశం, నవగ్రహ హోమం, అమ్మవారి విగ్రహానికి జలాధివాసం నిర్వహించనున్నారు. 17వ తేదీన ఉదయం యాగశాల పూజ, చండీ హోమం, సాయంత్రం స్థాపిత మండప పూజ, రుద్ర హోమం చేపట్టనున్నారు ఉత్సవాల్లో కీలకమైన 18వ తేదీన మధ్యాహ్నం 12. 05 గంటలకు శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి విగ్రహ, శికర ప్రతిష్ట.. అమ్మవారి ప్రాణ ప్రతిష్ట.. కళాన్యాసంను అశేష భక్తజనుల మధ్య నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం అమ్మవారికి బోనాలు సమర్పించి, ప్రథమ పూజతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాలు జరిగే మూడు రోజులపాటు ప్రతిరోజు మధ్యాహ్నం భక్తులకు అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గౌలిదొడ్డి గ్రామ ప్రజలు, స్థానిక భక్తులు రేణుక ఎల్లమ్మ అమ్మవారి ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొని, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

# వరదల్లో చిక్కుకున్న వారిని బీఆర్ఎస్ శ్రేణులు ఆదుకోవాలి : రవీందర్ యాదవ్



రవీందర్ యాదవ్

**రాజకీయాలకు అతీతంగా సేవా కార్యక్రమాలను నిర్వహించాలని పిలుపు**

ఈకబురు, శేరిలింగంపల్లి : హైదరాబాద్ లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అనేక ప్రాంతాలు జలమయమై, లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ శ్రేణులు ముందుకు రావాలని శేరిలింగంపల్లి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ విపత్కర పరిస్థితుల్లో బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు వరద బాధితులకు అండగా నిలవాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారని, ఆయన స్ఫూర్తితో సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని పార్టీ శ్రేణులను కోరారు. శేరిలింగంపల్లిలోని హైటెక్ సిటి, చందానగర్, మాదాపూర్, శేరిలింగంపల్లి ప్రాంతాలతో పాటు కొండాపూర్, మదీనగూడ, హఫీజ్ పేట్ లల్లో గులాబీ శ్రేణులు సహాయ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఇప్పటికే అన్ని రంగాల్లో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం వరద బాధితుల కోసం చర్యలు తీసుకున్నా.. లేకపోయినా, ప్రతిపక్షంగా మన బాధ్యత గా ప్రజలకు అండగా నిలిచేలా ముందుకు రావాలని కోరారు. బీఆర్ఎస్ కార్యకర్తలు వెంటనే వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లి త్రాగునీరు, పాలు, ఆహారం, మందులు, బట్టలు వంటి కనీస అవసరమైన సహాయాన్ని అందించాలన్నారు. అత్యవసర వైద్య అవసరాల కోసం కూడా అవసరమైనచోట మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సహాయక చర్యల్లో స్థానిక ప్రభుత్వ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కేటీఆర్ హయాంలోనే హైదరాబాద్ విశ్వనగరంగా అభివృద్ధి చెందిందన్నారు. దాన్ని కొనసాగించడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలం అయ్యిందన్నారు. వరద నీరు సరిగా వెళ్లేలా చూడాల్సిన బాధ్యతను మరిచి రాజకీయాలకు మాత్రమే పరిమితం అవుతున్నారని మండిపడ్డారు.

మొదటి పేజీ తరువాయి

# నా రిటైర్మెంట్‌లోపు పరిష్కారం చూపాలి

**కంచ గచ్చిబౌలి భూముల కేసు విచారణలో సీజేఐ జస్టిస్ గవాయ్ వ్యాఖ్యలు**

**భూముల అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నామన్న ప్రభుత్వం**

**పర్యావరణాన్ని కాపాడే చర్యలు చేపడితే.. అన్ని ఫిర్యాదులు ఉపసంహరిస్తామన్న ధర్మాసనం**

ఈ కబురు, న్యూఢిల్లీ: పర్యావరణ పరిరక్షణ చర్యల విషయంలో తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనలను స్వాగతిస్తున్నామని దేశ సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం చేసే అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని.. పర్యావరణ పరిరక్షణను పరిగణనలోకి తీసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పింది. 'ఏది ఏమైనా నా రిటైర్మెంట్‌లోపు కంచ గచ్చిబౌలి కేసులో పరిష్కారం చూపాలి'అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ తేల్చిచెప్పారుకంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై బుధవారం జస్టిస్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ, మేనక గురుస్వామి, కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, మరో పిటిషనర్ తరపున ఎస్. నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు.

**పకడ్బందీ చర్యలు చేపడుతున్నాం**

'అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం సమగ్ర ప్రణాళికలను రూపొందిస్తోంది. ఇందుకోసం మాకు మరికొంత సమయం కావాలి. వన్యప్రాణులు, అడవి, సరస్సు వంటి వాటిని రక్షించేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలను సిద్ధం చేస్తోంది. పర్యావరణం విషయంలో మేం మరింత పకడ్బందీ చర్యలు చేపడుతున్నాం'అని అభిక్ సింఘ్వీ ధర్మాసనానికి చెప్పారు. 'ప్రభుత్వ ప్రతిపాదనలను మేం ఆహ్వానిస్తున్నాం. మీరు మంచి ప్రతిపాదనలతో వస్తే, మేము ఫిర్యాదులన్నింటినీ ఉపసంహరిస్తాం. ఆ అటవీ ప్రాంతాన్ని రక్షించే మంచి ప్రతిపాదనలతో రండి. అలా వస్తే మిమ్మల్ని (ప్రభుత్వాన్ని) ధర్మాసనం కచ్చితంగా అభినందిస్తుంది'అని జస్టిస్ గవాయ్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలకు ధర్మాసనాలు వ్యతిరేకం కాదని పేర్కొన్నారు. కానీ, అభివృద్ధి అనేది సుస్థిరంగా ఉండాలని పదే పదే ప్రభుత్వానికి సూచించామని చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పుడు పర్యావరణం, వన్యప్రాణుల ప్రయోజనాలను ధ్వంసం చేసే చర్యలకు ఎవరూ ఉపసంహరించకూడదని ధర్మాసనం సూచించింది. 'ఈసారి ధర్మాసనం ముందుకొచ్చే సమయానికి ప్రభుత్వ ప్రతిపాదనలు చాలా అద్భుతంగా ఉంటాయని, ఇందుకు మాకు 6-8 వారాల సమయం కావాలి'అని అభిషేక్ మనుసింఘ్వీ ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. దీంతో ఈ కేసు విచారణను ఆరు వారాలకు వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం పేర్కొంది.



# యుద్ధం ఆపకుంటే.. తీవ్ర పరిణామాలు తప్పవు

వాషింగ్టన్, ఈ కబురు: ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ఆపకపోతే రష్యా తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఉక్రెయిన్ యుద్ధం, పుతిన్‌తో శుక్రవారం జరగనున్న భేటీ నేపథ్యంలో.. బుధవారం యూరోపియన్ దేశాల నేతలు, జెలెన్‌స్కీతో ట్రంప్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చలు జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పుతిన్‌తో మీ భేటీ తర్వాత కూడా ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ఆపేందుకు అంగీకరించకపోతే రష్యాపై ఏమైనా చర్యలు తీసుకుంటారా? అని ప్రశ్నించగా.. "అవును. ఈ విషయం నేను చెప్పకూడదు. కానీ రష్యా చాలా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని ట్రంప్ పేర్కొన్నారు.

ఒకవేళ పుతిన్‌తో తన సమావేశం సఫలమైతే.. వెంటనే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని కూడా కలుపుకొని మరో సమావేశం నిర్వహిస్తానని చెప్పారు. అదీ వాళ్లిద్దరి మధ్య తాను ఉండాలని వారు కోరుకుంటే ఉంటానని వ్యాఖ్యానించారు. అంతకుముందు వీడియో కాన్ఫరెన్స్‌లో జెలెన్‌స్కీ మాట్లాడుతూ.. "ఉక్రెయిన్ మొత్తాన్ని రష్యా ఆక్రమించగలదన్నట్టుగా పుతిన్ బుకాయిస్తున్నారు. ట్రంప్‌తో భేటీకానున్న నేపథ్యంలో ఉక్రెయిన్‌కు మద్దతుగా ఉన్న వారందరి మీదా ముందుగానే ఒత్తిడి పెంచే ప్రయత్నం చేస్తున్నారు. అమెరికా, యూరప్ దేశాలు విధించిన ఆంక్షలు రష్యాపై పెద్దగా ప్రభావం చూపడం లేదన్నట్టుగా పుతిన్ వ్యవహరిస్తున్నారు. కానీ ఆంక్షలతో రష్యా ఆర్థిక వ్యవస్థకు గట్టి దెబ్బ తగిలింది" అని పేర్కొన్నారు.'




# రష్యా అమ్మేసిన భూభాగంలోనే.. ట్రంప్-పుతిన్ భేటీ

ఈ కబురు: రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ముగింపు దిశగా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ .. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ కానున్నారు. ఈ చారిత్రక సమావేశానికి అమెరికా రాష్ట్రం అలాస్కా వేదిక కానుంది. అగ్రరాజ్యానికి భౌగోళికంగా, వ్యూహాత్మకంగా ఎంతో కీలకంగా ఉన్న ఈ ప్రాంతాన్ని గతంలో రష్యా నుంచే కొనుగోలు చేయడం విశేషం. ఇక్కడ నుంచి చూస్తే రష్యా కనిపిస్తుందని స్థానిక నేతలు చెబుతుంటారు. అలాస్కాలో గతంలో అనేక మంది ప్రపంచ నేతలు పర్యటించినప్పటికీ.. తొలి రష్యా అధ్యక్షుడిగా పుతిన్ నిలువనున్నారు.

గతంలో ప్రముఖుల పర్యటన..1971లో జపాన్ చక్రవర్తి హిరోహిటో అలాస్కాలో అడుగుపెట్టారు. ఆయనకు అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ స్వాగతం పలికారు.1984లో ఫెయిర్‌బ్యాంక్‌లోని ఎయిర్‌పోర్టులో పోప్‌జాన్ పాల్ IIతో నాటి అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్ భేటీ అయ్యారు. వీరిని చూసేందుకు వేలాది మంది ప్రజలు తరలివచ్చారు.2015లో అధ్యక్షుడు బరాక్ ఒబామా అలాస్కాలో పర్యటించారు. ఈ ప్రదేశంలో అడుగుపెట్టిన తొలి అమెరికా అధ్యక్షుడు కూడా ఆయనే కావడం విశేషం.చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ యాంకరేజ్‌లో 2017లో పర్యటించారు. ఉక్రెయిన్‌పై యుద్ధం చేస్తున్న రష్యాకు వ్యతిరేకంగా ఇక్కడ నిరసనలు వెల్లువెత్తాయి. పుతిన్ చర్యలకు వ్యతిరేకంగా స్థానిక చట్టసభలు కూడా తీర్మానాలు చేశాయి. ఇటువంటి ప్రాంతంలో పుతిన్‌తో ట్రంప్ సమావేశం నిర్వహించడం ఆసక్తిగా మారింది. అయిష్టంగానే కొన్నా..18531856 క్రిమియా యుద్ధంలో దారుణంగా దెబ్బతిన్న రష్యా.. ఆర్థికంగా ఇబ్బందుల్లో పడింది. దీంతో రష్యా జార్ చక్రవర్తి అలెగ్జాండర్2 అలాస్కాను అమ్మేయాలని నిర్ణయానికి వచ్చారు. తన శత్రువైన బ్రిటన్‌కంటే అమెరికాకు అమ్మటానికి మొగ్గుచూపారు. ఓ బృందం అలాస్కాకు వెళ్లి సర్వే చేసి దాని ఖరీదును లక్ష డాలర్లుగా అంచనా వేసింది.చివరకు సుమారు 36.5 కోట్ల ఎకరాల భూమిని కేవలం 72 లక్షల డాలర్లకు రష్యా అమ్మేసింది. 1867 అక్టోబరులో అయిష్టంగానే కొన్నప్పటికీ 20వ శతాబ్దంలో దాని ప్రాముఖ్యతను అమెరికా గుర్తించింది.1959లో అమెరికాలో 49వ రాష్ట్రంగా ఆవిర్భవించిన అలాస్కా సహజవనరులతో అగ్రరాజ్యానికి 'బంగారు కొండ'గా నిలుస్తోంది. భౌగోళికంగా వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన ఈ రాష్ట్రం రెండో ప్రపంచ యుద్ధం జరిగిన ఒకే ఒక ఉత్తర అమెరికా ప్రాంతంగా నిలిచింది.

# ఓటు 'పోటు మాటలు



ఈ కబురు,ఢిల్లీ: ఓటర్ల జాబితా రూపకల్పన, ఎన్నికల సంఘం (ఈసీ) పనితీరుపై అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం ముదురుతోంది. స్వతంత్ర వ్యవస్థల్ని కేంద్ర సర్కారు గుప్పిట్లోకి తీసుకుంటోందని విపక్షం ఆరోపిస్తోంది. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ తదితరులు ఓటుచోరీతోనే గెలిచారని భాజపా కొత్త ఆరోపణలు చేసింది. ఇటలీకి చెందిన సోనియా గాంధీ భారతదేశ పౌరసత్వం తీసుకోకముందే ఓటర్ల జాబితాలో ఆమె పేరు నమోదైందని గుర్తుచేసింది. బిహార్ శాసనసభ ఎన్నికల దృష్ట్యా ఈసీతో భాజపా కుమ్మక్కయి ఒక్కొక్కరికి రెండేసి ఓట్లు ఉండేలా చూసుకుంటోందని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ చెబుతున్నారు. ఓటుచోరీపై ఇక ప్రజల్లోకి వెళ్లి పోరాడతామని, దీనిని ప్రజా ఉద్యమంగా మార్చబోతున్నామని.. గురువారం జిల్లా కేంద్రాల్లో లోక్‌తంత్ర బచావో ర్యాలీలు నిర్వహిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. రాహుల్, ఇండియా కూటమిలోని ఇతర నేతలు బిహార్‌కు వెళ్లి ఈ నెల 17 నుంచి 'ఓట్ అధికార్ యాత్ర'లు నిర్వహిస్తారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ తెలిపారు. సెప్టెంబరు ఒకటిన పట్నాలో ఈ ఆందోళన ముగుస్తుందని చెప్పారు. దీనికి ముందు, వెనుక ఇతర కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఓటుచోరీ పేరుతో కాంగ్రెస్ ఒక వీడియో రూపొందించి విడుదల చేసింది. తప్పుడు ఓట్లు ఎలా వేస్తున్నారో వివరించింది. తప్పుడు ఓటర్ల జాబితా ఆధారంగా 2024 సార్వత్రిక ఎన్నికలు జరిగాయని భాజపా అంటున్నందువల్ల ఆ ఎన్నికలను చెల్లనివిగా ప్రకటించాలని, ప్రధాని మోదీ ఎన్నిక నిజమైనదో కాదో తెలియడానికి వారణాసి ఓటర్ల జాబితాలను బయటపెట్టాలని కాంగ్రెస్ ప్రచార విభాగాధిపతి పవన్ ఖేడా డిమాండ్ చేశారు. ఓట్లచోరీపై ఈ నెల 22 నుంచి వచ్చే నెల 7 వరకు రాష్ట్రస్థాయిలో, వచ్చే నెల 15 నుంచి అక్టోబరు 15 వరకు జాతీయ స్థాయిలో నిరసన ప్రదర్శనలతో ఉద్యమించాలని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది.

విపక్ష నేతలు రాహుల్‌గాంధీ (రాయ్‌బరేలీ), ప్రియాంకాగాంధీ (వయనాడ్), అభిషేక్ బెనర్జీ (డైమండ్ హార్బర్), అఖిలేశ్ యాదవ్ (కన్నౌజ్) లు ఓటుచోరీ ద్వారానే ఆయా లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించారని భాజపా ఆరోపించింది. వారంతా తమ సభ్యత్వాలకు రాజీనామా చేయాలని కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ ఠాకుర్ విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. ఒక్క వయనాడ్‌లోనే 93,499 మంది ఓటర్లపై అనుమానాలున్నాయని, రాయ్‌బరేలీలో ఇలాంటివారు 2.99 లక్షల మంది ఉన్నారని చెప్పారు. డీఎంకే అధినేత ఎం.కె.స్టాలిన్, సమాజ్‌వాదీ నేత డింపుల్ యాదవ్ కూడా రిగ్గింగు ద్వారానే ఆయా ఎన్నికల్లో గెలిచారని ఆరోపించారు. తప్పులు చేసినవారే అరిచి గీ పెడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ గతంలో ఎన్నో మోసాలకు పాల్పడిందని, సోనియా గాంధీ భారత పౌరసత్వం పొందడానికి మూడేళ్ల ముందే ఓటర్ల జాబితాలో ఆమె పేరును చేర్చారని భాజపా నేత అమిత్ మాలవీయ ఆరోపించారు. పౌరసత్వం లేనివారికి కాంగ్రెస్ హయాంలో ఓటుహక్కు ఎలా కల్పించారో చెప్పాలని డిమాండ్ చేశారు.

**'భాజపా కార్యకర్తలకు రెండేసి ఐడీలు'**

బిహార్‌లోని భాజపా నేతలు, కార్యకర్తలకు ఒకే అసెంబ్లీ స్థానంలో రెండేసి చొప్పున ఓటరు ఐడీలను ఈసీ జారీ చేస్తోందని తేజస్వీ యాదవ్ మరోసారి ఆరోపించారు. ఓటరు జాబితా తారుమారుకు భాజపాతో కలిసి ఈసీ పనిచేస్తోందని పట్నాలో విమర్శించారు. ముజఫర్‌పుర్ మేయర్ నిర్మలాదేవి (భాజపా)కి కూడా ఒకే అసెంబ్లీ స్థానంలో రెండు ఓటరు ఐడీలు ఉన్నాయని చెప్పారు. గత ఎన్నికల్లో విపక్షాలపైకి సీబీఐ, ఈడీలను పంపిన భాజపా ఇప్పుడు ఈసీని రంగంలోకి దింపిందని విమర్శించారు. 2020లో బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తమకు, ఎన్డీయేకు మధ్య ఓట్ల తేడా 12,000 మాత్రమేనని, కొన్నిచోట్ల 12.. 50.. 500 వ్యత్యాసంతో ఓడిపోయామని చెప్పారు. ముజఫర్‌పుర్ మేయర్‌కు ఈసీ నోటీసులు పంపింది. ఈసీ మాజీ ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ మన దేశంలోనే ఉన్నారని ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. 2024 సార్వత్రిక ఎన్నికలు ఆయన హయాంలోనే జరిగాయి.

**'మృత' ఓటర్లతో టీ తాగాను.. ఈసీకి ధన్యవాదాలు: రాహుల్**

బిహార్‌కు చెందిన కొంతమంది 'మృత'ఓటర్లతో కలిసి తేనీరు సేవించే భాగ్యం తనకు కలిగిందని, ఆ అవకాశం కల్పించిన ఈసీకి ధన్యవాదాలు అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. బిహార్‌కు చెందిన ఏడుగురు ఓటర్లు దిల్లీలో రాహుల్‌ను కలిశారు. వారు మృతి చెందారంటూ ఇటీవల ఓటర్ల జాబితా నుంచి తొలగించారని, తనకు ఎన్నో గమ్మత్తైన అనుభవాలున్నా ఇలా 'మృతుల'తో టీ తాగడం మహాగొప్పగా ఉందని కాంగ్రెస్ అగ్రనేత అత్యంత వ్యంగ్యంగా 'ఎక్స్'లో పేర్కొన్నారు. వారి వీడియోను దీనికి జతచేశారు. మృతిచెందినవారికి ప్రయాణ టికెట్లు అక్కర్లేదు కాబట్టి వెళ్లి దిల్లీ చూసిరండి అని ఆయన వారికి చెబుతున్నట్లు దానిలో ఉంది. ఎస్ఐఆర్ కసరత్తుకు ప్రధాని నరేంద్ర మోదీ నిజంగా మద్దతు ఇస్తున్నట్లయితే వెంటనే లోక్‌సభను రద్దుచేయాలని తృణమూల్ సీనియర్‌నేత అభిషేక్ బెనర్జీ కోల్‌కతాలో డిమాండ్ చేశారు. ఎంపిక చేసిన కొన్ని రాష్ట్రాల్లోనే కాకుండా ఎస్ఐఆర్‌ను దేశవ్యాప్తంగా చేయాలని విజ్ఞప్తి చేశారు.

# వారి నుంచి నాకు ముప్పు ఉండొచ్చు: రాహుల్ గాంధీ



ఈ కబురు: వి.డి.సావర్కర్ ను ఉద్దేశిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై పరువునష్టం కేసు నమోదైన విషయం తెలిసిందే. అయితే.. సావర్కర్, గాడ్సే భావజాలాన్ని అనుసరిస్తున్న వారి నుంచి తనకు ముప్పు పొంచి ఉండొచ్చని రాహుల్ పుణె కోర్టుకు తెలిపారు. ఈ నేపథ్యంలో తనకు అవసరమైన భద్రత అందించడం కేంద్రం బాధ్యత అని పేర్కొన్నారు.2023లో లండన్ పర్యటన సమయంలో సావర్కర్‌ను ఉద్దేశిస్తూ రాహుల్ గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో సావర్కర్ మునిమనవడు సాత్యకి సావర్కర్ ఆయనపై పరువునష్టం దావా దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు ఉన్నట్లు పోలీసులు గతంలో తేల్చారు. దీనిపై పుణెలోని ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణ ఇంకా ప్రారంభం కావాల్సి ఉంది. ఈ క్రమంలోనే రాహుల్ గాంధీ తరఫు న్యాయవాది కోర్టుకు తాజాగా ఓ అప్లికేషన్ సమర్పించారు. "తనకు నాథూరాం గాడ్సే, సావర్కర్ కుటుంబాలతో సంబంధం ఉందని సాత్యకి గతంలో వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆయన గత చరిత్రను దృష్టిలో పెట్టుకుని, ప్రస్తుత రాజకీయ వాతావరణాన్ని పరిగణనలోకి తీసుకుంటే.. సావర్కర్, గాడ్సే భావజాలానికి మద్దతు ఇచ్చే వ్యక్తుల నుంచి రాహుల్ గాంధీకి ముప్పు పొంచి ఉండే అవకాశాలను కొట్టిపారేయలేం. ఇటువంటి పరిస్థితుల్లో ఆయనకు రక్షణ కల్పించడం రాజ్యాంగబద్ధమైన బాధ్యత" అని అందులో పేర్కొన్నారు.

విచారణను ఆలస్యం చేయాలనే ఉద్దేశంతోనే రాహుల్ గాంధీ ఈ అప్లికేషన్‌ను దాఖలు చేశారని సాత్యకి సావర్కర్ ఆరోపించారు. అందులో పేర్కొన్న వాస్తవాలకు, ప్రస్తుత కేసుతో ఎటువంటి సంబంధం లేదని మీడియాతో అన్నారు. ఇదిలా ఉండగా.. ఈ కేసులో రాహుల్ గాంధీకి కోర్టు ఇప్పటికే బెయిల్ మంజూరు చేసింది.

# ఆ మాత్రం బ్యాంక్ బ్యాలెన్స్ ఉండాల్సిందే!

దేశంలో అతిపెద్ద ప్రైవేట్ బ్యాంక్ హెచ్‌డీఎఫ్‌సీ కూడా ఐసీఐసీఐ బ్యాంక్ బాటలోకే వచ్చేసింది. తమ బ్యాంకులో పొదుపు ఖాతాలకు మినిమమ్ బ్యాలెన్స్ అవసరాన్ని భారీగా పెంచుతున్నట్లు ప్రకటించింది. మెట్రో లేదా పట్టణ శాఖలో కొత్త పొదుపు ఖాతాను తెరిచే ఎవరైనా రూ .25,000 కనీస సగటు బ్యాలెన్స్ (ఎంఏబీ) నిర్వహించాల్సి ఉంటుంది. ఇది మునుపటి అవసరం రూ .10,000 కంటే రెట్టింపు.

ఈ మార్పు ఆగస్టు 1 నుండి అమల్లోకి వస్తుందని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు పేర్కొంది. అయితే ఈ కొత్త ఎంఏబీ నిబంధన కొత్త ఖాతాదారులకు మాత్రమే వర్తిస్తుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఇప్పటికే పొదుపు ఖాతా ఉన్న కస్టమర్లకు ఇప్పటివరకూ ఉన్న నిబంధనలే కొనసాగుతాయి. ఏదేమైనా ఆగస్టు నుంచి ఖాతాలు తెరిచే వారు అవసరమైన బ్యాంక్ బ్యాలెన్స్‌ను నిర్వహించకపోతే పెనాల్టీ ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుందని బ్యాంక్ స్పష్టం చేసింది.

**కొత్త నిబంధనలు**

అప్డేట్ చేసిన నిబంధనల ప్రకారం.. ఖాతాదారులు స్థిరంగా రూ .25,000 బ్యాలెన్స్ నిర్వహించాలి. సగటు నెలవారీ బ్యాలెన్స్ ఈ పరిమితి కంటే తక్కువగా ఉంటే బ్యాంకు జరిమానా విధిస్తుంది. పట్టణ,




మెట్రో శాఖలకు లోటులో 6 శాతం లేదా రూ.600లో ఏది తక్కువైతే అది జరిమానాగా లెక్కిస్తారు. ఈ సవరణకు ముందు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఎంఏబీ అవసరాలు పట్టణ శాఖలకు రూ.10 వేలు, సెమీ అర్బన్ బ్రాంచ్ లకు రూ.5,000 (నెలవారీ సగటు ), గ్రామీణ శాఖలకు రూ.2,500 (త్రైమాసిక సగటు)గా ఉండేది. సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతానికి ఈ పరిమితులు మారలేదు. తాజా సవరణ ప్రత్యేకంగా మెట్రో, పట్టణ ప్రాంతాల్లోని కొత్త ఖాతాలకు వర్తిస్తుంది.

**ఐసీఐసీఐ బ్యాంక్ మరీ భారీగా..**

ఓ వైపు ఎస్బీఐ, కెనరా బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ వంటి ప్రభుత్వ రంగ బ్యాంకులు సాధారణ పొదుపు ఖాతాలకు కనీస బ్యాలెన్స్ నిబంధనలను రద్దు చేస్తుంటే.. ప్రైవేటు బ్యాంకులు మాత్రం ఇప్పటికీ ఇలాంటి నిబంధనలను అమలు చేస్తున్నాయి. ఐసీఐసీఐ బ్యాంక్ మరింత దూకుడుగా మెట్రో, పట్టణ శాఖలలో కొత్త పొదుపు ఖాతాలకు ఎంఏబీని ఏకంగా రూ .50,000 కు పెంచేసింది. ఇది కూడా ఆగస్టు 1 నుంచే అమల్లోకి వస్తుంది.

కాగా విమర్శలు వెల్లువెత్తడంతో ఐసీఐసీఐ బ్యాంక్ దిగివచ్చింది. కనీస సగటు బ్యాలెన్స్ (ఎంఏబీ) అవసరాన్ని రూ.15 వేలకు తగ్గించింది. మరి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు కూడా అదే బాటలో తన నిర్ణయం మార్చుకుంటుందో లేదో వేచి చూడాలి.



# లాభాల్లో ముగిసిన మార్కెట్లు

భారత బెంచ్ మార్క్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీలు నేడు లాభాల్లో ముగిశాయి. ద్రవ్యోల్బణ గణాంకాలు తగ్గుముఖం పట్టడంతో మార్కెట్ సెంటిమెంట్ బలపడింది. బీఎస్ఈ సెన్సెక్స్ 304.32 పాయింట్లు లేదా 00.38 శాతం పెరిగి 80,539.91 వద్ద స్థిరపడగా, నిఫ్టీ 50 131.95 పాయింట్లు లేదా 0.54 శాతం పెరిగి 24,619.35 వద్ద ముగిసింది.

బీఎస్ఈలో బీఈఎల్, ఎటర్నల్, ఎంఅండ్ఎం టాప్ గెయినర్స్‌గా నిలవగా, అదానీ పోర్ట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఐటీసీ నష్టపోయాయి. ఎన్ఎస్ఈలో ఎన్టీపీసీ, టైటాన్, డాక్టర్ రెడ్డీస్ టాప్ గెయినర్స్‌గా నిలవగా, ఇండస్ఇండ్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, అదానీ ఎంటర్ప్రైజెస్ టాప్ లూజర్స్‌గా నిలిచాయి. విస్తృత సూచీలు గ్రీన్‌లో ముగిశాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ 100 ఇండెక్స్ 0.63 శాతం లాభపడగా, స్మాల్ క్యాప్ 0.66 శాతం లాభపడింది. రంగాలవారీగా పనితీరు మిశ్రమంగా ఉంది. నిఫ్టీ హెల్త్‌కేర్ 2.13 శాతం, ఫార్మా 1.73 శాతం, మెటల్ 1.26 శాతం, ఆటో 1.12 శాతం లాభపడ్డాయి. నిఫ్టీ ఎఫ్ఎంసీజీ, పీఎస్‌యూ బ్యాంక్, ఆయిల్ అండ్ గ్యాస్ వరుసగా 0.04 శాతం, 0.14 శాతం, 0.05 శాతం నష్టపోయాయి.

# జియో హాట్‌స్టార్ ఆ ఒక్క రోజు అందరికీ ఫ్రీ..

ప్రముఖ ఓటీటీ జియో హాట్‌స్టార్‌ను ఎటువంటి సబ్‌స్క్రిప్షన్ లేకుండా ఉచితంగా వీక్షించే అవకాశం.. అది కూడా జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా, బీఎస్ఎన్ఎల్.. ఇలా ఏ యూజర్ అయినా పర్వాలేదు. అయితే ఈ ఆఫర్ కేవలం ఒక్క రోజు మాత్రమే.

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న తమ ఓటీటీ యాప్‌లోని కంటెంట్ మొత్తం ఉచితంగా చూసే అవకాశం కల్పిస్తోంది జియో హాట్‌స్టార్. జియో హాట్ స్టార్‌కు చెందిన అన్ని షోలు, సినిమాలు, వెబ్‌సిరీస్‌లు రోజంతా ఉచితంగా వీక్షించవచ్చు.

ఈ బిగ్ అనౌన్స్‌మెంట్‌కు సంబంధించిన బ్యానర్ జియో హాట్‌స్టార్ యాప్‌లో కనిపిస్తోంది. ఈ బ్యానర్లలో "ప్రౌడ్ ఇండియన్ ప్రౌడ్లీ ఫ్రీ" అనే ట్యాగ్ లైన్ తో "ఫ్రీ" అని రాసి ఉంది. ఈ రోజున ప్రతి ఒక్కరూ జియో




హాట్‌స్టార్ కంటెంట్ను వీక్షించవచ్చు. ఇందుకోసం మొబైల్ లేదా టీవీ యాప్ లోకి లాగిన్ అవ్వాలి. ఆగస్టు 15న జియో హాట్‌స్టార్‌లో సలాకార్ అనే కొత్త సిరీస్ రాబోతోంది. ఇది ఒక డిటెక్టివ్ కథ. ఆగస్టు 15న ఉచితం కావడంతో ఈ సిరీస్‌ను ఉచితంగా ఆస్వాదించవచ్చు.

**ఈ ఆఫర్ అందరికీ..**

ఈ ఆఫర్ ప్రత్యేకత ఏమిటంటే జియో హాట్‌స్టార్‌ను చూడటానికి జియో యూజరే అయి ఉండవలసిన అవసరం లేదు. ఎందుకంటే జియో హాట్‌స్టార్ బండిల్ ఆఫర్ ఎయిర్‌టెల్, వీఐ ప్లాన్లలో కూడా అందుబాటులో ఉంది. మామూలుగా ఎంపిక చేసిన కొంత కంటెంట్ జియో హాట్‌స్టార్‌లో ఎప్పుడైనా ఉచితంగా చూడవచ్చు. కానీ ఆగస్టు 15న మాత్రం 24 గంటల పాటు మొత్తం కంటెంట్‌ను ఉచితంగా అందించనున్నారు.




# కొత్తగా 20,000 ఉద్యోగాలు..

**పీడబ్ల్యూసీ ఇండియా ప్రణాళికలు**

కన్సల్టెన్సీ దిగ్గజం పీడబ్ల్యూసీ ఇండియా వచ్చే ఐదేళ్ల వ్యవధిలో కొత్తగా 20,000 ఉద్యోగాలు కల్పించనుంది. దీనితో సంస్థలో మొత్తం సిబ్బంది సంఖ్య 50,000కు చేరనుంది. విజన్ 2030ని ప్రకటించిన సందర్భంగా పీడబ్ల్యూసీ ఇండియా చైర్‌పర్సన్ సంజీవ్ కృషన్ ఈ విషయం తెలిపారు. వచ్చే ఐదేళ్లలో వార్షికాదాయాల్లో 5% టెక్నాలజీ, ఇన్నోవేషన్ తదితర అంశాలపై ఇన్వెస్ట్ చేయనున్నట్లు వివరించారు. దాంతోపాటు డిజిటల్ పరివర్తన, క్లౌడ్, సైబర్‌సెక్యూరిటీలాంటి వ్యాపార విభాగాల పై దృష్టి పెట్టనున్నట్లు సంజీవ్ చెప్పారు. సిబ్బంది, భాగస్వాములకు కొత్త నైపుణ్యాల్లో శిక్షణనిచ్చేందుకు ఆదాయాల్లో 1 శాతం భాగాన్ని వెచ్చిస్తున్నట్లు వివరించారు. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోకి కూడా కార్యకలాపాలు విస్తరిస్తూ, హైరింగ్ చేపడుతున్నామని సంజీవ్ చెప్పారు. ప్రధానంగా ఆర్థిక సేవలు, హెల్త్‌కేర్, ఆటో, టెక్నాలజీ, మీడియా వంటి ఆరు విభాగాలపై ఫోకస్ పెడుతున్నట్లు వివరించారు.




# ఈ ఆదాయం లేకుంటేనే ₹12.75 లక్షల వరకు నో ట్యాక్స్!

మధ్యతరగతికి భారీ ఊరటనిస్తూ రూ.12 లక్షల వరకు ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదని కేంద్రం ఈ ఏడాది బడ్జెట్‌లో ప్రకటించింది. స్టాండర్డ్ డిడక్షన్ రూ.75 వేలు కలుపుకొంటే రూ.12.75 లక్షల వరకు ఒక్క రూపాయి కూడా పన్ను చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొంది. అంటే ఆ మొత్తానికి సెక్షన్ 87ఏ కింద రిబేట్ వర్తిస్తుంది. ఇది వేతన జీవులకు మాత్రమే. స్వల్పకాలిక మూలధన లాభాలు కలిగిన ఆదాయంపై ఈ రిబేట్ వర్తించదు. ఫిబ్రవరిలో ప్రకటించిన బడ్జెట్ నుంచి ఈ కొత్త నిబంధన తీసుకొచ్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (202526) నుంచి వర్తిస్తుంది.

**స్టాండర్డ్ డిడక్షన్‌లో సవరణ**

202526 ఆర్థిక సంవత్సర బడ్జెట్ సందర్భంగా ప్రకటించిన స్టాండర్డ్ డిడక్షన్ మినహాయింపునకు సంబంధించి పొరపాటు చోటుచేసుకుంది. దాన్ని తాజాగా సవరించారు. ఇన్‌కమ్ ట్యాక్స్ యాక్ట్, 1961 సెక్షన్ 115BAC (1A)లోని క్లాజ్ (iii) కింద స్టాండర్డ్ డిడక్షన్ మొత్తాన్ని రూ.75 వేలకు పెంచుతున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించారు. రూ.12.75 లక్షల వరకు ఎలాంటి పన్నూ చెల్లించాల్సిన అవసరం లేకుండా చేయడంలో దీని పాత్ర కీలకం. అప్పటి డ్రాఫ్ట్‌లో స్టాండర్డ్ డిడక్షన్ మొత్తాన్ని రూ.50 వేలుగానే పేర్కొన్నారు. ట్యాక్సేషన్ చట్టాలు (సవరణ) బిల్లు, 2025లో




ఆ పొరపాటును సరిదిద్దారు. దీంతో ఎప్పటిలానే రూ.12.75 లక్షల వరకు ఆదాయంపై ఎటువంటి పన్నూ చెల్లించాల్సిన అవసరం లేదు.

**రిబేట్ వీటికి వర్తించదు**

కొత్త ఆదాయపు పన్ను విధానంలో పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం రూ.12 లక్షల వరకు ఉంటే దానికి రూ.60 వేలు రిబేట్ కింద వర్తిస్తుంది. అయితే, సెక్షన్ 111ఏ, సెక్షన్ 112 కింద షార్ట్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్, లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ ఆదాయాలపై సెక్షన్ 87ఏ రిబేట్ వర్తించదు. అంటే మీ ఆదాయం రూ.12.75 లక్షలలోపు ఉన్నప్పటికీ స్వల్పకాలిక మూలధన లాభాలపై ప్రత్యేక పన్ను రేటు చెల్లించాల్సి ఉంటుంది.అదే పాత పన్ను విధానంలో అయితే 202425 ఆర్థిక సంవత్సరం మాదిరిగానే ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికీ రిబేట్ వర్తిస్తుంది. రూ.5 లక్షల వరకు ఆదాయంపై స్వల్పకాలిక మూలధన లాభాలు కలుపుకొని రూ.12,500 రిబేట్ వస్తుంది.



# మినిమమ్ బ్యాలెన్స్ పరిమితిని తగ్గించిన ఐసీఐసీఐ బ్యాంక్

ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్ మినిమమ్ బ్యాలెన్స్ పరిమితిపై వెనక్కి తగ్గింది. కొత్త పొదుపు ఖాతాలకు పెంచిన కనీస సగటు బ్యాలెన్స్ (ఎంఏబీ) ని తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. పట్టణ ప్రాంతాల్లో నిర్వహించాల్సిన కనీస సగటు బ్యాలెన్స్‌ను రూ.50 వేల నుంచి రూ.15 వేలకు తగ్గిస్తున్నట్లు వెల్లడించింది.

ఐసీఐసీఐ బ్యాంక్ ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చే కొత్త పొదుపు ఖాతాలకు కనీస సగటు బ్యాలెన్స్ (ఎంఏబీ) నిబంధనల్లో ఇటీవలె మార్పులు తీసుకొచ్చింది. బ్యాంక్ ఇదివరకు సవరించిన పాలసీ ప్రకారం.. మెట్రో, అర్బన్ కస్టమర్లకు ఎంఏబీ ఐదు రెట్లు పెరిగి రూ.50,000కు చేరింది. సెమీ అర్బన్ ప్రాంతాలకు రూ.25 వేలకు పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పుడు రూ.10,000గా ఉంది. ఇది మునుపటి కంటే నాలుగు రెట్లు ఎక్కువగా ఉండడం గమనార్హం. ఈ మార్పులు కొత్త ఖాతాదారులకు మాత్రమే వర్తిస్తాయని బ్యాంకు తెలిపింది. ఇప్పటికే ఉన్న ఖాతాదారులపై ఈ విధానం ప్రభావం చూపదని చెప్పింది.

అయితే ఐసీఐసీఐ బ్యాంక్ ఎంఏబీని అత్యంత భారీగా పెంచడంతో ఖాతాదారులు, ఫైనాన్స్ నిపుణుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా అధిక శాతం మంది ఖాతాదారులు నెలకు రూ.25,000 కంటే తక్కువే సంపాదిస్తున్నారు. అలాంటిది బ్యాంకు సేవింగ్స్ ఖాతాలో స్థిరంగా నగదు మెయింటెన్ చేయాలంటే వారి నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 'పొదుపు ఖాతాలో రూ.50,000 ఎంఏబీ చాలామంది భారతీయులకు ఆచరణీయం కాదు. 90 శాతం మంది భారతీయులు నెలకు రూ.25,000 కంటే తక్కువ సంపాదిస్తున్నారు. ఈ మార్పు వారికి శాపంగా మారుతుంది' అని ప్రముఖ బ్యాంకర్ జే కోటక్ తన ఎక్స్ ఖాతాలో చెప్పారు. దీనిపై ఆర్బీఐ కూడా స్పందించింది. ఎంఏబీని నిర్ణయించుకోవడం పూర్తిగా బ్యాంకుల ఇష్టమంటూ ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు.

# గూగుల్ క్రోమ్ కొనుగోలుకు పర్‌ప్లెక్సిటీ భారీ ఆఫర్..!

**కృత్రిమ మేధ స్టార్టప్ కంపెనీ పర్‌ప్లెక్సిటీ ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన ఓపెన్ సోర్స్ వెబ్‌బ్రౌజర్ గూగుల్ క్రోమ్‌ను కొనేందుకు ఆసక్తి చూపింది. అరవింద్ శ్రీనివాస్ నేతృత్వంలోని ఈ కంపెనీ గూగుల్‌కి మొత్తం 34.5 బిలియన్ డాలర్లు ఆఫర్ చేసినట్లు సమాచారం. ఇది పర్‌ప్లెక్సిటీ కంపెనీ మొత్తం విలువ కంటే ఎక్కువ కావడం గమనార్హం. బ్రౌజర్ విషయంలో గూగుల్ క్రోమ్ గుత్తాధిపత్యం కొనసాగుతోంది. దాన్ని విక్రయించాలని అమెరికా ప్రభుత్వం నుంచి ఓ వైపు ఒత్తిడి వస్తోంది. ఈ నేపథ్యంలో పర్‌ప్లెక్సిటీ నుంచి ఈ భారీ ఆఫర్ రావడం గమనార్హం.**

బ్లూమ్‌బర్గ్ కథనం ప్రకారం.. ఈ డీల్‌ను పూర్తి చేసేందుకు పర్‌ప్లెక్సిటీ బయటి పెట్టుబడిదారుల సాయం తీసుకోనుంది. బహుళ పెట్టుబడిదారులు ఈ లావాదేవీకి పూర్తిగా ఫైనాన్స్ చేయడానికి అంగీకరించారని కంపెనీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ దిమిత్రి షెవెలెంకో పేర్కొన్నారు. కంపెనీ జులైలో తాజాగా 100 మిలియన్ డాలర్లు సమీకరించింది. ఆ ఫండింగ్ రౌండ్‌లో కంపెనీ మొత్తం విలువ సుమారు రూ.1.57 లక్షల కోట్లుగా లెక్కగట్టారు. ఆ లెక్కన చూస్తే కంపెనీ విలువ కంటే గూగుల్ క్రోమ్‌కు ఆఫర్ చేసిన మొత్తం దాదాపు డబుల్ అనే చెప్పాలి.



ఈ ఆఫర్‌ను పర్‌ప్లెక్సిటీ 'టెక్ క్రంచ్'కు ఇచ్చిన ప్రకటనలో ధ్రువీకరించింది. క్రోమ్ కోర్ ఇంజిన్ అయిన క్రోమియంను ఓపెన్ సోర్స్‌గా కొనసాగిస్తాయని, ఏటా సుమారు 3 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడతాయని హామీ ఇచ్చింది. అలాగే ఈ డీల్ విజయవంతమైతే పర్‌ప్లెక్సిటీని వినియోగదారుల డిఫాల్ట్ సెర్చ్ ఇంజిన్‌గా మార్చబోమని, గూగూల్ క్రోమ్‌నే ఉంచుతామని స్పష్టం చేసింది.

**యాంటీ-ట్రస్ట్ ఒత్తిడి మధ్య గూగుల్**

గూగుల్ క్రోమ్‌ను విక్రయించాలన్న ప్రణాళికలపై ఇప్పటికీ స్పష్టత లేదు. బ్రౌజర్ విషయంలో గూగుల్ తన గుత్తాధిపత్యాన్ని నిలబెట్టుకునేందుకు యత్నించిందని వచ్చిన ఆరోపణలు వాస్తవమేనని కొలంబియా డిస్ట్రిక్ట్ కోర్టు తేల్చింది. శాంసంగ్, యాపిల్ సహా బడా కంపెనీలతో గూగుల్ ఒప్పందాలు చేసుకుందని.. తర్వాత ఆయా డివైజ్‌ల్లో గూగుల్ సెర్చ్ డిఫాల్ట్‌గా ఉండేలా వారికి చెల్లింపులు చేసిందని ఆరోపిస్తూ అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్ సహా అక్కడి కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కోర్టును ఆశ్రయించాయి. గూగుల్ విధానాలు చట్టవిరుద్ధమని తమ వ్యాజ్యంలో పేర్కొన్నాయి. తాజాగా గూగుల్ క్రోమ్‌ను విక్రయించాల్సిందిగా, సెర్చ్ డేటాను పోటీదారులకు లైసెన్స్ ఇవ్వాలని.. అలాగే ఇతర ప్లాట్‌ఫాంల్లో ప్రత్యేక ప్రమోషన్‌ల కోసం చెల్లింపులను ఆపాలని అమెరికా ప్రభుత్వం సూచించింది.

మరోవైపు పర్‌ప్లెక్సిటీ కృత్రిమ మేధ ఆధారంగా పనిచేసే సెర్చ్ ఇంజిన్, చాట్‌జీపీటీ తరహా యాప్. ఇది కామెట్ పేరుతో బ్రౌజర్ సేవలందిస్తోంది. 2026 నాటికి ఈ బ్రౌజర్ పది కోట్ల నుంచి వందల కోట్ల యూజర్లను చేరుకోవాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. దీని కోసం స్మార్ట్‌ఫోన్ తయారీదారులతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.

# 'కూలీ' విషయంలో నాకు ఆ భయం లేదు: శ్రుతి హాసన్



ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 'కూలీ' హంగామా కొనసాగుతోంది. అగ్రకథానాయకుడు రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ తెరకెక్కించిన యాక్షన్ థ్రిల్లర్ మరికొన్ని గంటల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో ప్రీతి అనే పాత్రలో శ్రుతి హాసన్ కనిపించనున్నారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'కూలీ' చిత్రం రజనీకాంత్ అభిమానులను సర్‌ప్రైజ్ చేస్తుందని వారిలో జోష్ పెంచారు.

"ఇందులో అగ్రహీరోలు రజనీకాంత్, నాగార్జున , ఆమిర్ ఖాన్ ఇలా ఎంతో మంది ఉన్నారు. నా పాత్రకు గుర్తింపు ఉండదేమో అనే భయం నాకు లేదు. ఎందుకంటే లోకేశ్ ఈ సినిమాను అద్భుతంగా రూపొందించారు. ప్రతి పాత్రకు న్యాయం చేసే విధంగా స్క్రిప్ట్ రాశారు. అందరి పాత్రలు భిన్నంగా ఉంటాయి. రజనీకాంత్‌తో వర్క్ చేస్తూ ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. ఆయన సెట్‌లో ఉంటే ఎంతో సందడిగా ఉంటుంది. ఆయనను చూడటమే ఒక అద్భుతం"

"తెరపై ప్రీతీని చూసేందుకు అందరిలాగే నేనూ ఎదురుచూస్తున్నా. 'ఖైదీ', 'మాస్టర్', 'విక్రమ్' వంటి సినిమాలతో వరుస విజయాలు సొంతం చేసుకున్న లోకేశ్ 'కూలీ'తో మరోసారి అందరినీ ఆశ్చర్యపరుస్తారు. ఆయన సినిమాల్లో ప్రేక్షకులకు నచ్చే యాక్షన్ సన్నివేశాలుంటాయి. భావోద్వేగాలతో పాటు వినోదానికి కూడా లోటుండదు. 'కూలీ' ప్రేక్షకుల అంచనాలకు ఏమాత్రం తగ్గదు. ముఖ్యంగా రజనీ అభిమానులకు ఇదో సర్‌ప్రైజ్. లోకేశ్ నాకు ఈ కథ చెప్పగానే అంగీకరించా. ప్రీతి పాత్ర మహిళలందరికీ నచ్చుతుంది" అని శ్రుతి ధీమా వ్యక్తం చేశారు.



# ఆ కండీషన్స్ ఒప్పుకుంటేనే వేతనాల పెంపు: నిర్మాత దిల్ రాజు

ఫిల్మ్ ఛాంబర్ నిర్మాతలు, ఫిల్మ్ వర్కర్స్ ఫెడరేషన్ చర్చలు ఇప్పట్లో తెగేలా కనిపించడం లేదు. ఇవాళ జరిగిన చర్చలు కూడా విఫలమయ్యాయి. దీంతో సినీ వర్కర్స్ సమ్మె యథావిధిగా కొనసాగనుంది. నిర్మాతలు, ఫెడరేషన్ మధ్య కొన్ని ప్రతిపాదనలపై సయోధ్యం కుదరలేదని తెలుస్తోంది. దీంతో మరోసారి భేటీ కావాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఈ సమావేశానికి నిర్మాత దిల్ రాజు కూడా హాజరై మాట్లాడారు.

ఈ చర్చలపై దిల్ రాజు మాట్లాడుతూ... ఫిల్మ్ ఛాంబర్‌లో ఫెడరేషన్ , నిర్మాతల మధ్య మీటింగ్ జరిగింది. వేతనాల పెంపు, నిర్మాతల వైపు నుంచి రెండు వర్కింగ్ కండీషన్స్‌పై ప్రధానంగా చర్చ జరిగింది. ఆ షరతులకు ఒప్పుకుంటేనే వేతనాలను పెంచుదామని నిర్మాతలు చెప్పారు. మరోసారి చర్చలు జరుగుతాయి. ఎందుకంటే ఇద్దరినీ బ్యాలెన్స్ చేయాల్సిన అవసరం ఉంది. రూ.2 వేల కన్నా తక్కువ వేతనం తీసుకునే వారికి ఒక పర్సంటేజీ ఆఫర్ చేస్తున్నాం. దాని కన్నా ఎక్కువ వేతనం తీసుకునే వాళ్లకు మరొక పర్సంటేజీ ఇవ్వాలని ప్రతిపాదించాం. ఫెడరేషన్‌లోని అన్ని యూనియన్‌లతో మాట్లాడుకుని వస్తే సమస్య పరిష్కరిస్తాం' అని అన్నారు.

రేపటి నుంచి చర్చలు కూడా కొనసాగుతాయని నిర్మాత సి కల్యాణ్ తెలిపారు. రేపు, ఎల్లుండి కూడా మీటింగ్స్ జరుగుతాయని క్లారిటీ ఇచ్చారు. డాన్సర్స్, ఫైటర్స్, టెక్నీషియన్స్ ఈ మూడు యూనియన్లకు పర్సంటేజ్ పెంచలేమని అన్నారు. సమ్మె కొనసాగించేందుకు నిర్మాతలు సైతం సిద్ధమేనని ఆయన ప్రకటించారు.

# 'పార్కింగ్' దర్శకుడితో విక్రమ్!



తమిళ కథానాయకుడు విక్రమ్ తదుపరి రెండు చిత్రాలు ఇప్పటికే ఖరారయ్యాయి. ఆయన 63వ సినిమాని మడోన్ అశ్విన్, 64వ చిత్రాన్ని ప్రేమ్ కుమార్ తెరకెక్కించనున్నారు. ఇప్పుడివి ఇంకా పూర్తి కాకముందే 65వ ప్రాజెక్ట్‌పైనా చర్చలు మొదలైనట్లు తెలుస్తోంది. 'పార్కింగ్' సినిమాతో జాతీయ స్థాయిలో మెరిశారు దర్శకుడు రామ్‌కుమార్ బాలకృష్ణన్. ఇప్పుడాయన విక్రమ్‌తో ఓ సినిమా చేసేందుకు సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఇదే చియాన్ 65వ చిత్రంగా పట్టాలెక్కనున్నట్లు తెలిసింది. ఈ ఏడాది చివర్లో దీనిపై ప్రకటన వెలువడే అవకాశముంది. రామ్ కుమార్ ప్రస్తుతం శింబుతో ఓ చిత్రం చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇది పూర్తయ్యాకే విక్రమ్ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చనున్నట్లు తెలుస్తోంది.



# నాకేం చేయాలో తోచట్లేదు.. చచ్చిపోతున్నట్లుగా అనిపిస్తోంది.. సదా కన్నీటిపర్యంతం

**వీధి కుక్కల బెడద ఎక్కువైపోతోంది. 11 సెకన్లకో కుక్కకాటు కేసు నమోదవుతోంది. పసికందులు, వృద్ధులపైనా వీధి కుక్కలు దాడి చేస్తున్నాయి. ఒక్క ఏడాదిలోనే (2024) దేశంలో 37 లక్షలకు పైగా కేసులు నమోదయ్యాయంటే సమస్య తీవ్రత ఎంత ఎక్కువగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కుక్కదాడి వల్ల రేబిస్ సోకి ఎంతోమంది చనిపోతున్నారు.**

**భౌభౌ.. ఇక కనిపించొచ్చు, వినిపించొద్దు**

ఈ తరుణంలో.. దేశ రాజధాని ఢిల్లీలో అన్ని కుక్కలను 8 వారాల్లోగా షెల్టర్లకు తరలించాని సుప్రీంకోర్టు సోమవారం (ఆగస్టు 11న) ఆదేశాలు జారీ చేసింది. ఎవరైనా దీన్ని అడ్డుకోవాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. న్యాయస్థానం తీర్పుపై సినీతారలు సోషల్ మీడియా వేదికగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

**తరలించడం జరగదు, చంపేస్తారా?**

తాజాగా హీరోయిన్ సదా మాట్లాడుతూ.. ఒక్క రేబిస్ కేసు కోసం 3 లక్షల కుక్కల్ని సిటీనుంచి తరలిస్తారు.. లేదా చంపేస్తారు. 8 వారాల్లో ప్రభుత్వం శునకాల కోసం షెల్టర్స్ ఎక్కడ? ఎలా? సిద్ధం చేయగలదు? ఇది జరగని పని! వాటికి ఆశ్రయం కల్పించడం సాధ్యపడదు కాబట్టి చివరకు చంపేస్తారు. మున్సిపల్ ఆఫీస్, ప్రభుత్వం.. వాటికి వ్యాక్సిన్ వేయకుండా ఏం చేసింది? ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్) ప్రోగ్రామ్‌కు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ఉండుంటే పరిస్థితి ఇక్కడివరకు వచ్చేదే కాదు.

**మా జేబులో నుంచి తీస్తున్నాం**

జంతుప్రేమికులు, ఎన్జీవోలు.. తమ పరిధిలో ఉన్న కుక్కలు, పిల్లల సంఖ్య పెరగకుండా తమశక్తిమేర ప్రయత్నిస్తున్నారు. వాటి ఆరోగ్యం బాగోలేదంటే మా జేబులో నుంచి డబ్బు తీసి చికిత్స అందిస్తున్నాం. ప్రభుత్వం ఆ మూగజీవాల కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయడం లేదు. వీధుల్లో శునకాలు ఉండకూడదన్న తీర్పు వచ్చేసింది. వాటి గురించి ఆలోచిస్తేనే మనసు ముక్కలవుతోంది. నాకేం చేయాలో తెలియడం లేదు.


**లోలోపలే చచ్చిపోతున్నా..**

ఎవరిని కలవాలి? ఎక్కడ నిరసన చేయాలి? ఏదీ తోచట్లేదు. కానీ ఒక్కటి మాత్రం చెప్పగలను.. ఈ తీర్పు నన్ను లోలోపలే చంపేస్తోంది. వాటిని చంపడం కరెక్ట్ కాదు. మన దేశాన్ని చూస్తుంటే సిగ్గుగా ఉంది. దయచేసి ఈ తీర్పు వెనక్కు తీసుకోండి అంటూ సదా ఏడ్చేసింది. సదా ఒక్కరే కాదు.. జాన్వీ కపూర్, చిన్మయి శ్రీపాద, వరుణ్ ధావన్, సోనాక్షి సిన్హా, భూమి పెడ్నేకర్.. తదితర సెలబ్రిటీలు సుప్రీం తీర్పును వ్యతిరేకిస్తున్నారు.

# ముగిసిన మంచు లక్ష్మి ఈడీ విచారణ... మూడున్నర గంటల పాటు..

**టాలీవుడ్ నటి మంచు లక్ష్మి ఈడీ విచారణ ముగిసింది. బెట్టింగ్ యాప్ కేసులో భాగంగా.. ఈ రోజు ఉదయం 11 గంటలకు బషీర్‌బాగ్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కార్యాలయానికి వెళ్లిన మంచు లక్ష్మిని ఈడీ బృందం దాదాపు మూడున్నర గంటల పాటు విచారించింది. ఈ సందర్భంగా తన బ్యాంకు ఖాతాలకు సంబంధించిన ఐదేళ్ల లావాదేవీలను ఈడీ అధికారులకు లక్ష్మి అందించారు. విచారణ అనంతరం మీడియాతో మాట్లాడకుండానే మంచు లక్ష్మి వెళ్లిపోయారు.**

**బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసిన సెలబ్రిటీలకు జులై 21న ఈడీ సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో జులై 30న ప్రకాశ్ రాజ్, ఈ నెల 6న విజయదేవరకొండ, 11న హీరో రానా ఈడీ ముందు హాజరయ్యారు. షెడ్యూల్ ప్రకారం ఈ రోజు మంచు లక్ష్మి విచారణకు హాజరైంది. బెట్టింగ్ యాప్స్ కేసులో నమోదైన వేర్వేరు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్‌ఫర్మేషన్ రిపోర్ట్(ఈసీఐఆర్) రిజిస్టర్ చేసిన సంగతి తెలిసిందే. లోన్ యాప్స్ ప్రచారకర్తలుగా వ్యవహరించిన మొత్తం 29 మందిని ఈసీఐఆర్‌లో చేర్చింది.**



# ఉదయభాను అగ్రెసివ్ రోల్.. త్రిభాణధారి బార్బరిక్ ట్రైలర్ రిలీజ్

సత్యరాజ్ లీడ్ రోల్లో నటించిన తాజా చిత్రం త్రిబాణధారి బార్బరిక్. ఈ సినిమాకు మోహన్ శ్రీవత్స దర్శకత్వం వహించారు. భీముడి మనవడు, ఘటోత్కచుడి కుమారుడైన బార్బరికుడి కథతో ఈ చిత్రం రూపొందించారు. ఈ చిత్రంలో ఉదయభాను ముఖ్య పాత్రలో కనిపించనుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ఆగస్టు 22న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఈ నేపథ్యంలోనే తాజాగా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ట్రైలర్ ఆద్యంతం ఆసక్తిని పెంచేలా ఉంది. ఈ కథను డ్రగ్స్ మాఫియా కోణంలో తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ఉదయభాను రోల్ చూస్తుంటే ఫుల్ అగ్రెసివ్‌గా కనిపించనున్నట్లు అర్థమవుతోంది. కాగా.. ఈ చిత్రంలో సత్యం రాజేశ్, వశిష్ఠ ఎన్.సింహా, సాంచి రాయ్, వీటీవీ గణేశ్, రాజేంద్రన్ కీలకపాత్రల్లో నటించారు.



# కెనడా అవుట్.. రేసులోకి భారత్.. ఆతిథ్య హక్కులు మనకే!

**న్యూఢిల్లీ:** 2030 కామన్వెల్త్ క్రీడలను స్వదేశంలో నిర్వహించాలనే ఉద్దేశంతో వేసిన బిడ్‌ను భారత ఒలింపిక్ సంఘం బుధవారం ఆమోదించనుంది. అంతర్జాతీయ క్రీడా పోటీలకు ఆతిథ్యమివ్వాలని చాన్నాళ్లుగా ప్రయత్నిస్తున్న భారత్... 2036 ఒలింపిక్స్ నిర్వహణకు సైతం ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో విశ్వక్రీడలకు ముందు కామన్వెల్త్ గేమ్స్ నిర్వహించి మన సత్తా ప్రపంచానికి చాటాలనుకుంటోంది.

ఇప్పటికే ఈ క్రీడలు నిర్వహించేందుకు ఆసక్తి ఉన్నట్లు కామన్వెల్త్ గేమ్స్ సమాఖ్యకు భారత్ వెల్లడించింది. అహ్మదాబాద్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించింది. బిడ్‌లు దాఖలు చేసేందుకు ఈ నెల 31 తుదిగడువు కాగా... దానికి ముందే ఫైనల్ బిడ్ వేయాల్సి ఉంటుంది.

ఈ నేపథ్యంలో నేడు జరగనున్న భారత ఒలింపిక్ సంఘం ప్రత్యేక సర్వసభ్య సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో పాటు ఇతర అంశాలు సైతం సమావేశంలో చర్చకు రానున్నాయి.

**ఆతిథ్య రేసు నుంచి కెనడా అవుట్**

ఇక ఆతిథ్య రేసు నుంచి కెనడా తప్పుకోవడంతో... భారత్‌కే హక్కులు దక్కే అవకాశాలున్నాయి. కామన్వెల్త్ గేమ్స్ డైరెక్టర్ డారెన్ హాల్ నేతృత్వంలోని అధికారుల బృందం మూడు రోజుల పాటు అహ్మదాబాద్‌లో పర్యటించి వేదికలను పరిశీలించింది. గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో చర్చించింది. ఈ నెలాఖరులో కామన్వెల్త్ గేమ్స్‌కు చెందిన మరో ప్రతినిధి బృందం భారత్‌ను సందర్శించనుంది. ఆతిథ్య హక్కుల ప్రకటన ఈ ఏడాది నవంబర్‌లో వెలువడే అవకాశాలున్నాయి.

'కామన్వెల్త్ గేమ్స్ ఆతిథ్య హక్కులు పలు అంశాలతో ముడిపడి ఉంటాయి. క్రీడా సదుపాయాలు, ప్రభుత్వ సహకారం, నిర్ణయాల్లో స్థిరత్వం, ఆకర్షణ ఇలాంటివి కీలకం. 2030 కామన్వెల్త్ ఆతిథ్య హక్కులు భారత్‌కే దక్కుతాయనే నమ్మకముంది' అని ఐఓఏ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు హర్‌పాల్ సింగ్ పేర్కొన్నారు.




# అర్జున్–కీమెర్ ఆరో రౌండ్ గేమ్ 'డ్రా'

**చెన్నై:** చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నీ మాస్టర్స్ కేటగిరీలో ప్రపంచ ఐదో ర్యాంకర్, భారత గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ ఖాతాలో మూడో 'డ్రా' చేరింది. విన్సెంట్ కీమెర్ (జర్మనీ)తో మంగళవారం జరిగిన ఆరో రౌండ్ గేమ్‌ను అర్జున్ 41 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. ఇతర గేముల్లో జోర్డెన్ వాన్ ఫోరీస్ట్ (నెదర్లాండ్స్) 51 ఎత్తుల్లో నిహాల్ సరీన్ (భారత్)పై, అవండర్ లియాంగ్ (అమెరికా) 61 ఎత్తుల్లో ప్రణవ్ (భారత్)పై గెలిచారు. రే రాబ్సన్ (అమెరికా)-కార్తికేయన్ మురళీ (భారత్) గేమ్ 123 ఎత్తుల్లో... విదిత్ గుజరాతి (భారత్)-అనీశ్ గిరి (నెదర్లాండ్స్) గేమ్ 109 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిశాయి. ఆరో రౌండ్ తర్వాత కీమెర్ 4.5 అగ్రస్థానంలో కొనసాగుతుండగా... 3.5 పాయింట్లతో అర్జున్ రెండో స్థానంలో ఉన్నాడు.

ఇదే టోర్నమెంట్ చాలెంజర్స్ కేటగిరీలో భారత గ్రాండ్‌మాస్టర్, హైదరాబాద్ క్రీడాకారిణి ద్రోణవల్లి హారిక తొలి విజయం అందుకుంది. భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ వైశాలితో జరిగిన ఆరో రౌండ్ గేమ్‌లో నల్ల పావులతో ఆడిన హారిక 80 ఎత్తుల్లో గెలిచింది.

# బాబర్ ఆజం వరల్డ్ రికార్డు బద్దలు కొట్టిన గిల్.. ఆ ఘనత సాధించిన ఏకైక ప్లేయర్‌గా..




**పాకిస్తాన్ మాజీ కెప్టెన్ బాబర్ ఆజం పేరిట ఉన్న ప్రపంచ రికార్డును టీమిండియా టెస్టు కెప్టెన్ శుబ్‌మన్ గిల్ బద్దలు కొట్టాడు. అత్యధికసార్లు ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డును గెలిచిన ఆటగాడిగా కొనసాగుతున్న బాబర్‌ను వెనక్కినెట్టి.. సరికొత్త చరిత్ర సృష్టించాడు.**

కాగా అంతర్జాతీయ క్రికెట్ మండలి ప్రతీ నెలా ప్రకటించే 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' జూలై నెలకు గానూ గిల్ గెలుచుకున్న విషయం తెలిసిందే. ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో అద్భుత ప్రదర్శన అతడిని జూలై నెల అవార్డుకు అర్హుడిగా మార్చింది.

**754 పరుగులు**

ఐదు టెస్టుల ఈ సిరీస్‌లో మొత్తం 754 పరుగులు చేసిన గిల్... అవార్డుకు పరిగణనలోకి తీసుకున్న జూలై నెలలో 3 టెస్టుల్లో కలిపి 567 పరుగులు సాధించాడు. ఇందులో బర్మింగ్‌హామ్‌లో జరిగిన రెండో టెస్టులో రెండు ఇన్నింగ్స్‌లలో చేసిన 269, 161 (మొత్తం 430) పరుగుల ప్రదర్శన గిల్ కెరీర్‌లో హైలైట్‌గా నిలిచింది.

ఐసీసీ అవార్డుకు ఎంపికైనందుకు సంతోషం వ్యక్తం చేసిన గిల్... ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో తాను ఆడిన 269 పరుగుల ఇన్నింగ్స్ ఎప్పటికీ తనకు మధుర జ్ఞాపకంగా మిగిలిపోతుందని వ్యాఖ్యానించాడు.

**ఎప్పటికీ మర్చిపోలేనిది**

'ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ద మంత్‌గా ఎంపిక కావడం సంతోషంగా ఉంది. కెప్టెన్‌గా తొలి టెస్టు సిరీస్‌లో ప్రదర్శనకుగాను నాకు గుర్తింపు దక్కడం దీనిని మరింత ప్రత్యేకంగా మార్చింది. బర్మింగ్‌హామ్‌లో చేసిన డబుల్ సెంచరీ ఎంతో ప్రత్యేకమైంది. ఎప్పటికీ మర్చిపోలేనిది.

ఇంగ్లండ్‌తో సిరీస్ కెప్టెన్‌గా నేను ఎంతో నేర్చుకునే అవకాశం కల్పించింది. ఇరు జట్లు చాలా బాగా ఆడాయి. ఆటగాళ్లందరికీ కూడా ఇది చిరస్మరణీయం. మున్ముందు ఇదే తరహా ప్రదర్శనను కొనసాగిస్తాను' అని గిల్ స్పందించాడు.

ఇదిలా ఉంటే.. ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డు పొందడం గిల్‌కిది నాలుగోసారి. 2023 జనవరిలో, సెప్టెంబర్‌లో... 2025 జనవరిలో, జూలైలో గిల్‌కు ఈ అవార్డు దక్కింది. ఈ క్రమంలోనే అత్యధికసార్లు ఈ అవార్డు నెగ్గిన మేల్ క్రికెటర్‌గా.. అదే విధంగా.. ఒకే ఏడాదిలో రెండుసార్లు అవార్డు గెలిచిన తొలి ప్లేయర్‌గా గిల్ నిలిచాడు.

**అత్యధికసార్లు ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డు గెలిచిన పురుష క్రికెటర్లు వీరే**

1. శుబ్‌మన్ గిల్- ఇండియా- నాలుగుసార్లు విజేత
2. బాబర్ ఆజం- పాకిస్తాన్- మూడుసార్లు విజేత
3. శ్రేయస్ అయ్యర్- ఇండియా- రెండుసార్లు విజేత
4. షకీబ్ అల్ హసన్- బంగ్లాదేశ్- రెండుసార్లు విజేత
5. హ్యారీ బ్రూక్- ఇంగ్లండ్- రెండుసార్లు విజేత
6. కమిందు మెండిస్- శ్రీలంక- రెండుసార్లు విజేత




# డెవన్ కాన్వే పేరుతో నన్ను ఓ వ్యక్తి మోసం చేయాలనుకున్నాడు: అశ్విన్

**ఐపీఎల్ 2025 సీజన్ ముగిన తర్వాత ఓ వ్యక్తి చెన్నై సూపర్ కింగ్స్ సహచరుడు డెవన్ కాన్వే పేరుతో తనను మోసం చేయాలని చూశాడని రవిచంద్రన్ అశ్విన్ తెలిపాడు. ఈ విషయాన్ని అతడు తన యూట్యూబ్ ఛానల్‌లో వెల్లడించాడు. అయితే ఈ సంఘటన ఇటీవలే చోటుచేసుకున్న రజత్‌పటీదార్ సిమ్ ఉదంతాన్ని గుర్తుకు తెచ్చేలా ఉంది.**

''ఐపీఎల్ ముగిసిన తర్వాత ఓ వ్యక్తి నాకు తనను తాను డెవన్ కాన్వే అని చెప్పుకుంటూ మెసేజ్ చేశాడు. నేను నిజమే అనుకుని అతడికి సమాధానం ఇచ్చాను. కాసేపటికి అతడు.. 'నేను విరాట్ కోహ్లీ నంబర్‌ను మిస్సయ్యాను. నువ్వు నాకు తిరిగి పంపిస్తావా?' అని మెసేజ్ చేశాడు. దీంతో నేను నంబర్ ఇచ్చాను. అలా నేను నంబర్ పంపిన తర్వాత కూడా అతడు.. 'నేను ఇంకా మరికొందరి నంబర్లు కూడా మిస్సయ్యాను' అని మళ్లీ మెసేజ్ చేశాడు. అప్పుడు 'ఇంకా ఎవరెవరివి..?' అని అతడికి రిప్లై ఇచ్చాను. దాని అతడు.. 'రోహిత్ శర్మ, ఎం.ఎస్.ధోనీ' అని సమాధానం పంపాడు. అప్పుడు నాకు అనుమానం వచ్చింది. దీంతో నేను అతణ్ని 'నేను ఇచ్చిన బ్యాట్ ఎలా ఉంది?' అని ప్రశ్నించా. దానికి అతడు 'అది అద్భుతంగా ఉంది' అని రిప్లై ఇచ్చాడు. నిజానికి నేను ఎవరికీ బ్యాట్ ఇవ్వలేదు. దీంతో వెంటనే ఆ నంబర్‌ను బ్లాక్ చేశాను. తర్వాత నేను చెన్నై సూపర్ కింగ్స్ వాట్సప్ గ్రూప్‌లోకి వెళ్లి చెక్ చేస్తే.. అది డెవన్ కాన్వే నంబర్ కాదని తెలిసింది. అయితే అదృష్టం ఏంటంటే నేను విరాట్ కోహ్లీ ప్రస్తుతం వాడే నంబర్ కాకుండా, ఆస్ట్రేలియాలో ఉన్నప్పుడు అతడు ఉపయోగించిన వాట్సప్ నంబర్ పంపా..'' అని అప్పుడు జరిగిన విషయాన్ని అశ్విన్ పూసగుచ్చినట్లు వివరించాడు.

ఛత్తీస్‌గఢ్‌లోని ఓ కుగ్రామానికి చెందిన మనీశ్‌కు ఇటీవల విరాట్ కోహ్లీ, ఏబీ డివిలియర్స్ అంటూ ఫోన్ కాల్స్ వచ్చాయి. అయితే తమ స్నేహితులెవరో తనను ఆట పట్టిస్తున్నారనుకుని మనీశ్ ఊరుకున్నాడు. అలాగే ఓ సారి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్ రజత్ పటీదార్‌ను మాట్లాడుతున్నా.. అని ఓ ఫోన్ కాల్ వచ్చింది. అది కూడా ఫ్రాంక్ కాల్ అనుకున్న మనీశ్.. 'ఓ.. నువ్వు ఆర్సీబీ కెప్టెన్‌వా.. అయితే నేను సీఎస్‌కే కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ' అంటూ సమాధానం ఇచ్చాడు. నిజానికి రజత్ పటీదార్ చాలాకాలంపాటు వాడిన సిమ్‌కు మూడు నెలలుగా రీఛార్జి చేయలేదు. దీంతో ట్రాయ్ నిబంధనల ప్రకారం దాన్ని మరో వ్యక్తికి కేటాయించారు. యాదృచ్ఛికంగా ఆ సిమ్‌ను మనీశ్ కొనుగోలు చేశాడు. ఆఖరుకు రజత్ పటీదారు ఫిర్యాదు కారణంగా.. పోలీసులు ఎంట్రీ ఇచ్చి, అసలు విషయం మనీశ్‌కు వివరించారు. దీంత అతడు ఆ సిమ్‌ను తిరిగి అప్పగించాడు.



# సంజూ శాంసన్‌కు నో ఛాన్స్..? ఆర్సీబీ స్టార్‌కు చోటు?

ఆసియాకప్ 2025 టోర్నీకి సమయం అసన్నమవుతోంది. ఈ మెగా ఈవెంట్ సెప్టెంబర్ 9న నుంచి యూఏఈ వేదికగా ప్రారంభం కానుంది. ఈ ఖండాంతర టోర్నీలో మొత్తం 8 జట్లు పాల్గొనున్నాయి. భారత క్రికెట్ జట్టు డిఫెండింగ్ ఛాంపియన్స్ హోదాలో బరిలోకి దిగనుంది.

ఈ ఆసియా సింహాల పోరు కోసం భారత జట్టును బీసీసీఐ సెలక్షన్ కమిటీ వచ్చే వారం ప్రకటించనుంది. అయితే ఈ 18 మంది సభ్యుల జట్టులో ఎవరికి చోటు దక్కుతుందా అని అందరూ ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ బ్యాటర్ దీప్ దాస్‌గుప్తా కీలక వ్యాఖ్యలు చేశాడు.

ఆసియాకప్ కోసం భారత జట్టులో వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్‌కు చోటు దక్కడం కష్టమేనని అతడు అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్‌లో అతడి కంటే మెరుగ్గా రాణించిన వికెట్ కీపర్లు ఉన్నారని ఆయన అన్నారు.




కాగా గౌతమ్ గంభీర్ ప్రధాన కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత సంజూ శాంసన్ టీ20ల్లో అదరగొట్టాడు. శాంసన్ 16 ఇన్నింగ్స్‌లలో 34.78 సగటుతో 487 పరుగులు చేశాడు. ఇందులో మూడు సెంచరీలు ఉన్నాయి. కానీ బలమైన ఇంగ్లండ్ జట్టుపై మాత్రం ఈ కేరళ ఆటగాడు బ్యాట్ ఝూళిపించలేకపోయాడు. ఐదు ఇన్నింగ్స్‌లలో కేవలం 51 పరుగులు మాత్రమే చేశాడు. అందులో మూడు సింగిల్ డిజిట్ స్కోర్లు ఉన్నాయి.

"సంజూ శాంసన్ ఇటీవల కాలంలో టీ20ల్లో అద్భుతంగా రాణించాడు. కానీ స్వదేశంలో ఇంగ్లండ్‌తో పూర్తి స్థాయి జట్టుతో ఆడినప్పుడు శాంసన్ ఇబ్బంది పడ్డాడు. సూర్యకుమార్ నాయకత్వంలో భారత్ తమ ప్రధాన జట్టులో ఆడిన ఏకైక సిరీస్ అది. అక్కడ అతడు ఆకట్టుకోలేకపోయాడు.

అతడు ఆసియాకప్‌నకు ఎంపికయ్యే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. ఎందుకంటే ఓపెనర్‌గా అభిశర్మ ఎలానూ ఉంటాడు. మరో ఓపెనర్ యశస్వి జైశ్వాల్‌ను ఎంపిక చేయాలని భావిస్తున్నాను. అతడికి టీ20ల్లో మంచి రికార్డుతో పాటు అనుభవం ఉంది.

ఇప్పుడు వికెట్ కీపర్ స్లాట్ కోసం జితేష్ శర్మ, సంజూ శాంసన్‌ల మధ్య పోటీ నెలకొంది. జితేష్‌కు మిడిల్ ఆర్డర్‌లో అనుభవం ఉంది. అంతేకాకుండా అతడు మంచి ఫినిషింగ్ కూడా అందించగలడు. ఐపీఎల్‌లో ఆర్సీబీ తరపున తన సత్తా ఎంటో జితేష్ చూపించాడు. ఒకవేళ శాంసన్ ఎంపికైనా తుది జట్టులో చోటు దక్కడం కష్టమే" అని దాస్‌గుప్తా టైమ్స్ ఆఫ్ ఇండియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు.